RNI No : APTEL 2020/80757

www.sreeprasthanam.in

# శ్రీ ప్రస్థానం

మన దేశం..మన హక్కు

తెలుగు దినపత్రిక

కర్నూలు సంపుటి : 04 సంచిక : 92

బుధవారం 07-08-2024

పేజీలు :04 వెల:రూ. 2.00

## తిరుమలలో .. హైదరాబాద్ బాలుడు...

తిరుమల, ఆగస్టు 6 హైదరాబాద్‌లో కనిపించకుండా వెళ్లిపోయిన బాలుడు కేసు కీలక మలుపు తిరిగింది. రెండు రోజుల క్రితం హైదరాబాద్‌లో అదృశ్యమైన బాలుడు ఇప్పుడు తిరుపతిలో దర్శనమిచ్చాడు. తాను తిరుమల వెంకటేశ్వర స్వామి దర్శనానికి వచ్చానని చెబుతున్నాడు. హైదారాబాద్ మీర్ పేటకు చెందిన బాలుడిని తిరుపతిలో పోలీసులు గుర్తించారు. ఆ బాలుడిని విచారిస్తే తిరుమల శ్రీవారి దర్శనానికి వచ్చానని చెబుతున్నాడు. ఇంట్లో వాళ్లతో మాట్లాడించిన పోలీసులు బాలుడిని చైల్డ్ హోంకు తరలించారు. కన్నవారితో చర్చించిన పోలీసులు కర్నూలు నుంచి వచ్చే బంధువులకు బాలుడిని అప్పగించనున్నారు. హైదరాబాద్‌లో ఉంటున్న బాలుడు రెండు రోజులుగా కనిపించకుండా పోయాడు. ట్యూషన్‌కు వెళ్లిన బాలుడు తిరిగి రాకపోవడంతో కన్నవాళ్లు ఆందోళనకు గురయ్యారు. ఎవరైనా కిడ్నాప్ చేసి ఉంటారని పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు సీసీ టీవీ ఫుటేజ్ ఆధారంగా విచారణ చేపట్టారు. తెలుగు రాష్ట్రాల్లోని ప్రధాన నగరాల్లో ఉన్న పోలీసులకు సమాచారం అందజేశారు. బాలుడి వివరాలు సమాచార మాధ్యమాల ద్వారా తెలుసుకున్న కొందరు వ్యక్తులు బాలుడు ఒంటరిగా తిరుపతి రైల్వే స్టేషన్‌లో ఉండటాన్ని గమనించారు.

## విలేఖరులు కావలెను

ఆంధ్రప్రదేశ్ మరియు తెలంగాణ రాష్ట్రాల వ్యాప్తంగా " శ్రీ ప్రస్థానం దినపత్రికలో " పనిచేయుటకు జిల్లా స్టాఫర్లు, సిసి ఇంచార్జులు, మండల స్థాయి పాత్రికేయులు కావలెను. సమాజంలో జరిగే ప్రతి విషయాన్ని ప్రజల ముంగిటకు తీసుకెళ్లాలనే ఆసక్తి, అనుభవం ఉన్నవారికి ప్రధాన్యత ఉంటుంది.

పెరుమాళ్ళ వర ప్రసాద్


సంప్రదించవలసిన నంబర్లు

94916 28386 85220 22029

Land Line No : 08517 224194

## ఏపీలో యూట్యూబ్ అకాడమీ ఏర్పాటు.. సీఈవోతో చంద్రబాబు కీలక చర్చలు

అమరావతి : ఆంధ్రప్రదేశ్‌కు పెట్టుబడులపై దృష్టి సారించిన సీఎం చంద్రబాబు నాయుడు ఆ దిశగా అడుగులు వేస్తున్నారు. ఈ క్రమంలోనే యూట్యూబ్ గ్లోబల్ సీఈవో నీల్ మోహన్, గూగుల్ ఓఖంఅ హెడ్ సంజయ్ గుప్తాతో ఇవాళ సమావేశమైన చంద్రబాబు ఏపీలో యూట్యూబ్ అకాడమీ ఏర్పాటు చేయాలని ఆహ్వానించారు. ఈ మేరకు మంగళవారం వారితో ఆన్‌లైన్‌లో సమావేశమైన



చంద్రబాబు నాయుడు.. ఏపీలో పెట్టుబడుల గురించి చర్చించారు. ఈ విషయాన్ని చంద్రబాబు నాయుడు ట్విట్టర్ (ఎక్స్) వేదికగా వెల్లడించారు. యూట్యూబ్ గ్లోబల్ సీఈవో నీల్ మోహన్, గూగుల్ ఓఖంఅ హెడ్ సంజయ్ గుప్తాతో సమావేశం కావడం చాలా ఆనందంగా ఉందని సీఎం చంద్రబాబు అన్నారు. స్థానిక భాగస్వాములతో కలిసి ఏపీలో యూట్యూబ్ అకాడమీ ఏర్పాటుపై వారితో చర్చించామని తెలిపారు. యూట్యూబ్ అకాడమీ ఏర్పాటు ద్వారా కంటెంట్, స్కిల్ డెవలప్‌మెంట్, ఏఐ, సర్టిఫికేషన్ ప్రోగ్రామ్స్ వంటి వాటిపై ప్రత్యేకంగా పరిశోధనలు చేయవచ్చని అన్నారు. అందుకే యూట్యూబ్ అకాడమీకి సంబంధించి అమరావతిలో భాగమైన మీడియా సిటీలో సాంకేతిక సహాయం అందించడానికి ఉన్న అవకాశాలను వారితో చర్చించామని చంద్రబాబు వెల్లడించారు.

## ప్రతిపక్షనేతగా కూడా జగన్ అనర్హుడు



ప్రజలే అలా తీర్పు ఇచ్చినా బుద్ది మారలేదు
ప్రతిపక్ష హోదా, భారీగా భద్రత కావాలనుకోవడం తగదు
గతంలో కాల్వలను కూడా పట్టించుకోకుండా నిర్లక్ష్యం
నీటిని సద్వినియోగం చేసుకునేలా ప్రణాళికలు
జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు

అమరావతి,ఆగస్ట్6: జలవనరుల శాఖపై సిఎం చంద్రబాబు నాయుడు సీక్షించారు. నీటి వనరుల వినియోగం,ప్రాజెక్టుల తీరుపై సమీక్షించారు. ఇందులో మంత్రి నిమ్మల రామానాయుడు, అధికారులు జి. సాయిప్రసాద్, ఎవి రాజమౌళి, ఎం. వెంకటేశ్వరరావు, సిఇలు, ఎస్ఇలు పాల్గొన్నారు. అనంతరం మంత్రి రామానాయుడు మీడియాతో మాట్లాడారు. ప్రతిపక్ష నేతగా కూడా ఉండటానికి మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్సీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డికి అర్హత లేదని ప్రజలు ప్రజా తీర్పు ఇచ్చారని జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు గుర్తుచేశారు. అయినా ప్రతిపక్ష హోదా కావాలని, భారీగా భద్రత కావాలని కోరుకోవడం దుర్మార్గం తప్ప మరోటి కాదన్నారు. ఇప్పటికి జగన్ పద్ధతిలో మార్పు రావడం లేదని మంత్రి నిమ్మల విమర్శించారు. ఆఫ్ఘనిస్తాన్, అమెరికాను బెదిరించినట్లు ప్రభుత్వాన్ని జగన్, వైసీపీ నేతలు బెదిరిస్తున్నారని ఆరోపించారు. జగన్ సింహం అని ఆ పార్టీ నేతలు అన్నారని... వైసీపీ నేత సజ్జల రామకృష్ణారెడ్డి ఒక విషసర్పం ఇద్దరు క్రూరమైన ప్రవృత్తి గలవారని ఆక్షేపించారు. సకల శాఖ మంత్రిగా సజ్జల వైసీపీ ప్రభుత్వంలో పని చేశారని గుర్తుచేశారు. అమరావతిలో నిర్వహించిన మీడియా సమావేశంలో మంత్రి మాట్లాడారు. జగన్ ఆయన పద్ధతిపై ఆత్మ పరిశీలన చేసుకోవాలని హితవు పలికారు. పరామర్శల పేరుతో ప్రభుత్వాన్ని విమర్శించే హక్కు ఆయనకు లేదని అన్నారు. ఆస సుధాకర్, డ్రైవర్ సుబ్రహ్మణ్యంలను ఎలా చంపారో అందరికీ తెలుసునని చెప్పారు. ప్రజాదర్బార్ ద్వారా ప్రజా సమస్యలను పరిష్కరించే వీలు ఉంటుందని జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రజలు నేరుగా సమస్యలను తెలియజేసే అవకాశం ఉంటుందని వివరిం చారు. ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కృషి చేస్తున్నారని వెల్లడించారు. ప్రభుత్వం దగ్గర అభివృద్ధికి సరిపడినంతా నిధులు లేకపోయినా ప్రజా సంక్షేమానికి కట్టుబడి పని చేయాలని అధికారులకు సూచించారు. మంత్రి లోకేష్ తన శాఖలో మంచిపేరు సంపాదించారని తెలిపారు. అందుకే ఆయనపై అక్కసుతో మాజీ మంత్రి పేర్ని నాని విమర్శలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. రాష్ట్రంలో రిజర్వాయర్‌లు అన్నీ జలకళను సంతరించుకున్నాయని మంత్రి నిమ్మల రామానాయుడు వెల్లడించారు.

## ఏపీలో రాష్ట్రపతి పాలన విధించాలని కోర్టుకు వెళతాం : వైఎస్ జగన్



అమరావతి : ఏపీలో వైసీపీ శ్రేణులు, ప్రజలపై జరుగుతున్న దాడులపై హైకోర్టు సుప్రీం కోర్టుల కు వెళతామని, రాష్ట్రంలో ఎందుకు రాష్ట్రపతి పాలన విధించకూడదో కోర్టులను అడుగుతామని మాజీ సీఎం వైఎస్ జగన్ పేర్కొన్నారు. టీడీపీ శ్రేణుల దాడుల్లో గాయపడ్డ వైసీపీ కార్యకర్తలను మంగళవారం విజయవాడ ఆస్పత్రిలో పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో శాంతి భద్రతలు కరువయ్యారని ఆరోపించారు. మహిళలు, చిన్నపిల్లలపై అఘాత్యాలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. రాష్ట్రంలో నెలకొన్న పరిస్థితులపై గవర్నర్ జోక్యం చేసుకోవాలని కోరుతూ వినతిపత్రం అందజేస్తామని తెలిపారు. ఏపీలో దాడులు, కిరాతాలకు పాల్పడి ఏం సాధిస్తారని చంద్రబాబును ప్రశ్నించారు. కొత్త ప్రభుత్వం ఏర్పడితే ప్రభుత్వంపై వ్యతిరేకత రావడానికి సమయం పడుతుందని, కాని కూటమి ప్రభుత్వానికి కొద్ది సమయంలో వ్యతిరేకత ఫాస్ట్‌గా ప్రారంభమయిందని ఆరోపించారు. కక్షలు, కార్పణ్యాలు తీర్చుకోవాలని చంద్రబాబు గ్రీన్‌సిగ్నల్ ఇస్తున్నారని పేర్కొన్నారు. గ్రామస్థాయి నుంచి భయాందోళనలు నెలకొని ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. అన్ని రోజులు ఒకేలా ఉండవని తామూ అధికారంలోకి వస్తామని అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత కొనసాగుతున్న దాడులను జాతీయ స్థాయికి తీసుకెళ్లి వివరించామని తెలిపారు. దాడులతో ప్రజలు ఎవరూ కూడా భయపడరని, ఇది కోపంగా మారి ప్రభుత్వాన్ని, పార్టీని బంగాళాఖాతంలోకి కలిపే పరిస్థితులు వస్తాయన్నారు. చదువులను, వైద్యాన్ని నిర్వీర్యం చేస్తున్నారని విమర్శించారు.

## ఇండియాకు వస్తానని హసీనా రిక్వెస్ట్ చేశారు: కేంద్ర మంత్రి జైశంకర్

న్యూఢిల్లీ: బంగ్లాదేశ్‌లో నెలకొన్న రాజకీయ సంక్షోభంపై ఇవాళ భారత విదేశాంగ మంత్రి రాజ్యసభలో ప్రకటన చేశారు. ఫ్లయిట్ క్లియరెన్స్ కోసం హసీనా సర్కారు నుంచి అభ్యర్థన వచ్చినట్లు కేంద్ర మంత్రివెల్లడించారు. బంగ్లాలో శాంతి, భద్రతలు నెలకొనే వరకు ఆందోళన ఉండనున్నట్లు చెప్పారు. గడిచిన 24 గంటల నుంచి ఢాకా అధికారులతో టచ్‌లో ఉన్నామని, సున్నితమైన అంశాల గురించి చర్చించామన్నారు. బంగ్లాదేశ్‌లో ఉన్న భారతీయులతో సంప్రదింపులు జరుపుతున్నట్లు ఆయన చెప్పారు. భద్రతా దళాల నేతలతో చర్చలు జరిపిన తర్వాతనే బంగ్లాదేశ్ ప్రధాని షేక్ హసీనా రాజీనామా నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోందని మంత్రి జైశంకర్ వెల్లడించారు. చాలా తక్కువ సమయంలోనే .. ఇండియాకు వచ్చేందుకు ఆమె రిక్వెస్ట్ చేసినట్లు మంత్రి తెలిపారు. సోమవారం సాయంత్రం ఆమె ఢిల్లీకి చేరుకున్నట్లు చెప్పారు. బంగ్లాదేశ్‌లో జరుగుతున్న పరిణామాల గురించి వివరిస్తూ.. అక్కడ జరిగిన హింస, అస్థిరతపై ఆందోళన వ్యక్తం చేస్తున్నట్లు తెలిపారు. 2024 జనవరి ఎన్నికల నాటి నుంచి బంగ్లాదేశ్‌లో పరిస్థితి ఆందోళనకంగా ఉందన్నారు. బంగ్లా రాజకీయాల్లో వర్గ పోరు పెరిగిందన్నారు. జూన్‌లో విద్యార్థి సంఘాల ఉద్యమం ఊపందుకుందని మంత్రి జైశంకర్ తెలిపారు. రోజు రోజుకూ హింస పెరిగిందని, పబ్లిక్ ఆస్తులను ధ్వంసం చేశారని, జూలై నెలలోనూ హింస కొనసాగినట్లు మంత్రి చెప్పారు. ఈ సమయంలోనే చర్చలు నిర్వహించాలని బంగ్లాను కోరినట్లు ఆయన వెల్లడించారు. సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చినా.. ప్రజలు మాత్రం ఆందోళనలు విరమించలేదన్నారు.

## విశాఖ కార్పొరేషన్ ఎన్నికల్లోనూ కూటమి ప్రభుత్వం విజయం సాధించాలి : ఏపీ డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్

అమరావతి : భవిష్యత్‌లో జరుగబోయే విశాఖ కార్పొరేషన్ ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం విజయం సాధించేలా అందరూ సహాయ, సహకారాలు అందించాలని ఏపీ డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. మంగళవారం విజయవాడలోని




మంగళగిరి పార్టీ కార్యాలయంలో విశాఖపట్నంకు చెందిన 5గురు వైసీపీ కార్పొరేటర్లు జనసేన పార్టీలో చేరా రు. ఈ సందర్భంగా వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రం విభజన తరువాత రాష్ట్రం బలంగా ఉండాలనే లక్ష్యంతో కలిసి పనిచేశామని అన్నారు. వ్యక్తిగతంగా తనకు వైసీపీ శత్రువు కాదని అన్నారు. నాయకుల మాటల విధానం పార్టీ నష్టపోతుందని పేర్కొన్నారు. పార్టీలో చేరిన వారికి తగిన గుర్తింపు ఉంటుందని వివరించారు. దేశంలో ఎక్కడా లేని విధంగా గాలి, నీటి కాలుష్య సమస్య వైజాగ్‌లో ఎక్కువగా ఉందని వెల్లడించారు. కాలుష్యాన్ని నివారించేందుకు కార్పొరేటర్లపై బాధ్యత ఎక్కువగా ఉందని తెలిపారు.

## అభివృద్ధి దిశగా అడుగులేస్తున్న అమరావతి

రాజధానిలో వేగంగా నిర్మాణ పనులు
చంద్రబాబు నాయకత్వలో అభివృద్దిలో వేగం
మీడియా సమావేశంలో రఘురామ వెల్లడి

న్యూఢిల్లీ,ఆగస్ట్6(: ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి అభివృద్ధి దిశగా అడుగులేస్తుందని ఉండి ఎమ్మెల్యే రఘురామ కృష్ణం రాజు వివరించారు. అమరావతిలో వేసిన రోడ్లను వైసీపీ నేతలు మాయం చేశారని ఆరోపించారు. ఆంధ్రప్రదేశ్‌కు రూ. 15 వేల కోట్ల ఆర్థిక సాయం చేస్తామని కేంద్ర ప్రభుత్వం ప్రకటన చేసిందని గుర్తు చేశారు. కేంద్ర సంస్థలకు సీఎం చంద్రబాబు స్థలం కేటాయించారని, ఇప్పుడు రాజధానిలో నిర్మాణాలు వేగంగా జరుగుతున్నాయని ఎమ్మెల్యే రఘురామ పేర్కొన్నారు. మంగళవారం నాడు రఘురామ తన కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. ఏపీలో ప్రభుత్వం మారింది, చంద్రబాబు నాయకత్వంలో ఆంధప్రదేశ్ అభివృద్ధిలో ముందుకు వెళ్తుందన్నారు. ప్రభుత్వం ఏర్పడి 55 రోజులు అవుతుందని గుర్తుచేశారు. సమయం ఇవ్వకుండా వైసీపీ నేతలు ప్రభుత్వంపై విమర్శలు చేయడం సరికాదని హితవు పలికారు. చంద్రబాబు నాయకత్వంలో రాష్ట్రంలో ఎన్నో సంక్షేమ పథకాలు అమలు అవుతున్నాయని తెలిపారు. జగన్ ప్రభుత్వం ఎంత అప్పు చేసిందో ఇంకా తెలియడం లేదని.. దీనిపై ఓ స్పష్టత రావాల్సి ఉందని చెప్పారు. చంద్రబాబుకు ఏపీని అభివృద్ధి చేసే సామర్థ్యం ఉందని ఎమ్మెల్యే రఘురామ తెలిపారు. అమరావతిలో గజం ఇప్పుడు 40 వేలు ఉంది. ప్రజలకు ప్రభుత్వంపై విశ్వాసం ఉంది. రాజధాని అమరావతి అని అందరికీ నమ్మకం కలిగింది. తెలంగాణలో రియల్ ఎస్టేట్ స్తబ్దత నెలకొంది. తెలంగాణలో రేట్లు 10 శాతం తగ్గాయి. దీనికి కారణం ఏపీలో చంద్రబాబు నాయుడు రావటం. చంద్రబాబు హయాంలో ఒక విజన్ ఉంది. గతంలో కొందరు కలెక్టర్లు వైసీపీకి ప్రభుత్వానికి తొత్తులుగా వ్యవహరించారు. ఐఏఎస్‌కు పూర్వవైభవం వచ్చేలా ఈ ప్రభుత్వం ఉంది. ఐఏఎస్‌లకు చంద్రబాబు గతంలో ఎక్కువ గౌరవం ఇచ్చే వారు. ఇప్పుడు ఎమ్మెల్యేలకు సమయం ఇస్తామని కూడా చెప్పారు. ఎమ్మెల్యేలను జగన్ గతంలో పట్టించుకోలేదు. అందుకే ఆయన11 సీట్లకే పరిమితం అయ్యారు. జగన్మోహన్ రెడ్డి నుంచి గతంలో అందరికీ ముప్పు ఉండేది. ఇప్పుడు జగన్‌కి ప్రజల నుంచి ఎలాంటి ముప్పు లేదని రఘురామ పేర్కొన్నారు. 900 వందల మంది సిబ్బందిని వేసుకుని జగన్ ఎక్కడికి వెళ్తాడు. జగన్‌ను ఎవరు ముట్టుకుంటారు...? పార్లమెంట్‌లో ప్రశ్నల సమయంలో ఎక్కువ సోది ఉండదు. పార్లమెంట్ ఏడాదికి పని దినాలు 90 రోజులు ఉంటాయి. గతంలో అసెంబ్లీ సగం రోజులు కూడా జరగలేదు. నియోజకవర్గంలో ఐదు రోజులు పాటు ఉంటూ, ప్రజా సమస్యలపై దృష్టి పెట్టాను. నియోజకవర్గంలో మంచినీటి సమస్యను పరిష్కారిస్తున్నా. స్కూల్స్ ఆధునీకరణ, హాస్టల్స్ , టాయిలెట్స్ నిర్మాణానికి ప్రజలంతా ముందుకు వస్తున్నారని రఘురామ పేర్కొన్నారు.



## మాజీ సిఎంకు తగిన భద్రత ఇచ్చాం

జగన్ కోరుకున్నట్లుగా సిఎంలకిచ్చే భద్రత అసాధ్యం
పులివెందుల నుంచి కూడా భారీగా వినతులు
హోంమంత్రి వంగలపూడి అనిత వెల్లడి



అమరావతి,ఆగస్ట్6: మాజీ సీఎం జగన్‌కు సరిపడా భద్రత కల్పిస్తున్నామని ఏపీ హోంమంత్రి అనిత అన్నారు. ఒక మాజీ సీఎంకు 980మందితో భద్రత అవసరమా అని ప్రశ్నించారు. ప్రతిపక్ష హోదా, భద్రతపై రాజకీయ లబ్దికోసమే జగన్ హైకోర్టులో పిటిషన్ వేశారన్నారు. తెదేపా కార్యాలయంలో మంగళవారం ఆమె ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. అనంతరం ఆమె మీడియాతో మాట్లాడారు. తనకు వచ్చిన వినతుల్లో గత ప్రభుత్వ హయాంలో జరిగిన భూదోపిడీ, దాడులు, అక్రమాలపైనే పెద్ద సంఖ్యలో ఫిర్యాదులు ఉన్నట్లు తెలిపారు. జగన్ బాధితులు.. పులివెందుల నుంచి ప్రజా దర్బార్‌కు వస్తున్నారని ఈ సందర్భంగా అనిత వెల్లడించారు. తనకు భద్రతను పునరుద్ధరించాలని కోరుతూ జగన్ హైకోర్టును ఆశ్రయించడంపై విలేకర్లు అడిగిన ప్రశ్నకు అనిత స్పందించారు. 980 మంది అంటే ఒక చిన్న గ్రామంలో ఓటర్ల సంఖ్యంత. ఒక గ్రామ పంచాయతీ అంత సెక్యూరిటీ ఆయన అడుగుతున్నారు. మాజీ సీఎంగా ఆయనకు ఇవ్వాల్సిన భద్రతను ప్రభుత్వం కొనసాగిస్తోంది. సీఎంగా ఉన్నప్పుడు ఉన్నంత భద్రత ఇవ్వాలని అడుగుతున్నారు. అంత భద్రత ఎలా ఇస్తాం? భద్రత గురించి కోర్టులో పిటిషన్ వేసుకోండి.. కానీ ప్రభుత్వంపై బురదజల్లే ప్రయత్నం చేయడం తప్పు. కోడికత్తి దాడి జరిగిందని ఐదేళ్ల తర్వాత జగన్‌కు గుర్తొచ్చిందా? సీఎంగా ఉన్నప్పుడు ఆ కేసును ఎందుకు పరిష్కరించుకోలేకపోయారు? ఎన్నిసార్లు కోర్టు విచారణకు పిలిచినా.. ఏదో వంకతో హాజరు కాలేదు.. దీన్నిబట్టే ఆయనదంతా డ్రామా అని అర్థమవుతోంది. ప్రతిపక్ష హోదా కావాలంటే పది శాతం అసెంబ్లీలో సీట్లు ఉండాలనే విషయం జగన్‌కి తెలియదా?‘ అని నిలదీశారు.

# సంపాదకీయం

**బుధవారం 07-08-2024**

## బంగ్లాదేశ్‌లో అల్లర్లు పాక్, ఐసిస్ పనేనా?

దేశంలో ప్రజా వ్యతిరేక చర్యలు ఏవైనా ప్రభుత్వాలు తీసుకుంటే ప్రజలు తిరగడతారనడానికి అతి పెద్ద ఉదాహరణ బంగ్లాదేశ్. రిజర్వేషన్లు ప్రధాని షేక్ హాసీనా పదవకి? ఎసరు తెచ్చాయి. చివరకు ఆమె తన పదవికి రాజీనామా చేసి దేశం విడిచి వెళ్లాల్సి వచ్చింది. ఇటీవల శ్రీలంకలో ఆర్థిక మాంద్యం కారణంగా ప్రజలు తిరగబడి ప్రధాని నివాసంలోకి చొరబడి అక్కడ బీభత్సం సృష్టించిన సంగతిని చూశాం. ఇప్పుడు తాజాగా బంగ్లాదేశ్ లోనూ షేక్ హసీనా నివాసం ఉండే భవనంలోకి ఆందోళనకారులు చొరబడి అందిన కాడికి వస్తువులను దోచుకెళ్లారు. సైన్యం ఎంత ప్రయత్నించినా ఫలితం లేకుండా పోయింది. చివరకు బంగ్లాదేశ్ లో సైనిక పాలన విధించారు. 1971లో బంగ్లాదేశ్ స్వాతంత్ర్యం కోసం పోరాడినవారి కుటుంబీకులకు ప్రభుత్వం 30 శాతం రిజర్వేషన్లు కల్పించింది. కొన్నేళ్లుగా ఉద్యోగాలు లేక నిరాశలో ఉన్న యువత ఈ నిర్ణయంపై ఆందోళనలకు దిగింది. నిరసనలు హింసాత్మకంగా మారడంతో రిజర్వేషన్లను ఐదు శాతానికి తగ్గించాలని సుప్రీం ఆదేశించింది. 93 శాతం ప్రతిభ ఆధారంగా, రెండు శాతం మైనార్టీలు, దివ్యాంగులకు కేటాయించాలని తెలిపింది. అయితే పూర్తిగా రిజర్వేషన్లు రద్దు చేయాలనేది ఆందో ళనకారుల డిమాండ్ గా వినిపిస్తుంది. ఇదే అతి పెద్ద ఆందోళనగా మారింది. ప్రభుత్వ అనుకూల, వ్యతిరేక వర్గాలుగా విడిపోయి ఘర్షణలకు దిగారు. బంగ్లాదేశ్ నుంచి పొరుగునే ఉన్న భారత్‌లోని త్రిపుర రాజధాని అగర్తలకు ప్రత్యేక మిలిటరీ హెలికాప్టర్‌లో హసీనా చేరుకున్నారు.బంగ్లాదేశ్ వ్యవస్థాపక అధ్యక్షుడు అయిన షేక్ ముజిబుర్ రెహమాన్ కుమార్తె షేక్ హసీనా, ప్రపంచంలో అతి ఎక్కువ కాలం ప్రధానిగా కొనసాగిన మహిళగా పేరు పొందారు. బంగ్లాదేశ్ లో సివిల్ సర్వీసెస్ ఉద్యోగాల్లో రిజర్వేషన్లు తేవాలని ప్రభుత్వం నిర్ణయించడం ప్రస్తుత పరిస్థితికి దారి తీసింది. స్వాతంత్ర్య సమరయోధుల వారసులకు 30 శాతం ఉద్యోగ కోటాను పునరుద్ధరించాలని హైకోర్టు ఆదేశించింది. దీంతో గత నెలలో నిరసనలు ప్రారంభమయ్యాయి.బంగ్లాదేశ్ జనాభా 17 కోట్లకు పైగా ఉన్నారు. అందులో దాదాపు 3 కోట్లకు పైగా యువకులు నిరుద్యోగులుగా ఉండగా, వారిలో కొందరు విద్యకు దూరం అయ్యారు. స్వాతంత్ర్య సమరయోధుల కుటుంబాలకు 30 శాతం రిజర్వేషన్ కోటాను ప్రభుత్వం కొట్టేయాలని విద్యార్థులు, విద్యార్థి సంఘాలు పిలుపునిచ్చారు. కోర్టు ఆదేశాలనే తాము శిరసావహిస్తామని షేక్ హసీనా స్పష్టం చేశారు. విద్యార్థుల డిమాండ్లను నెరవేర్చేందుకు హసీనా నిరాకరించడంతో పరిస్థితి బాగా తీవ్రం అయింది.అంతేకాక, 1971 సమయంలో బంగ్లాదేశ్ స్వాతంత్ర్య సమరంలో పాల్గొన్న వారి వారసులకు ఈ కోటా వర్తింపజేయడాన్ని వ్యతిరేకిస్తున్నవారు 'రజాకార్లు' అని పేర్కొంటూ షేక్ హసీనా వ్యాఖ్యలు చేశారు. దీంతో జూలై నెలలో ఢాకా యూనివర్సిటీలోని తమ హాస్టళ్లను వదిలేసి వేలాది మంది విద్యార్థులు నిరసన తెలిపారు. హసీనా వ్యాఖ్యలు అగ్నికి ఆజ్యం పోసినట్లు అయ్యాయి. ఫలితంగా దేశవ్యాప్తంగా పౌరుల్లో అశాంతిని కలిగించింది. దీంతో బంగ్లాదేశ్ సుప్రీంకోర్టు సివిల్ సర్వీస్ ఉద్యోగాల విషయంలో వివాదాస్పద కోటా విధానాన్ని వెనక్కి తీసుకుంది. దాని పరిధిని తగ్గించింది కానీ పూర్తిగా రద్దు చేయలేదు.దేశ వ్యాప్తంగా నిరసనల్లో పాల్గొంటున్న వారు విద్యార్థులు కారని, వారంతా ఉగ్రవాదులు అని ప్రధాని షేక్ హసీనా కొన్ని మాటలు అన్నారు. వారిని అణచివేయాలని ప్రజలకు పిలుపు ఇచ్చారు. దీంతో నిరసన కారులు మరింత రెచ్చిపోయారు. వన్, టూ, త్రీ, ఫోర్.. షేక్ హసీనా ఈజ్ ఏ డిక్టేటర్ అంటూ నినాదాలతో హోరెత్తించారు. నిరసన కారులను అదుపు చేసేందుకు బంగ్లాదేశ్‌లో పోలీసులు, ఇతర భద్రతా సిబ్బంది కొద్ది వారాలుగా ప్రయత్నిస్తున్నారు. కానీ నిలువరించలేకపోతున్నారు. కొన్ని విద్యార్థి సంఘాలు పిలుపునిచ్చిన 'పూర్ణ అసహయోగ్ ఆందోళన్' ఢాకా నగరంతో పాటు కొద్ది రోజుల్లోనే దేశ వ్యాప్తంగా విస్తరించింది. ప్రధాన మంత్రి షేక్ హసీనా పదవి నుంచి దిగిపోవాలనే విపరీతమైన డిమాండ్ చేయడంతో విద్యార్థి నాయకులు నిరసనలకు పిలుపునివ్వడంతో ఆ దేశంలో శాంతి భద్రతలు మరింతగా క్షీణించాయి.సివిల్ సర్వీసెస్ కోటాలో సంస్కరణలు తీసుకురావాలని డిమాండ్ చేస్తూ యూనివర్సిటీ విద్యార్థులు బయటికి వచ్చారు. రోడ్లు, రైల్వే లైన్లను మూసేయడం, కార్యకలాపాలను దిగ్బంధించడం మొదలుపెట్టారు. ఈ కోటా విధానం హసీనాకు చెందిన అవామీ లీగ్ పార్టీ అనుచరులకు అనుకూలంగా ఉందని వారు గొంతెత్తారు.జూలై 18 నాటికి ప్రశాంతత కోసం హసీనా చేసిన వ్యాఖ్యలపై విద్యార్థులు కదం తొక్కారు. ఆమె పదవి నుంచి దిగిపోవాలని, కొత్త ప్రభుత్వం రావాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ భవనాలతో పాటు బంగ్లాదేశ్ టెలివిజన్ మెయిన్ ఆఫీసును కూడా తగులబెట్టారు.జూలై 21న బంగ్లాదేశ్ సుప్రీం కోర్టు ఉద్యోగ కోటాను తిరిగి ప్రవేశపెట్టడానికి వ్యతిరేకంగా తీర్పు ఇచ్చింది. ఈ కోర్టు నిర్ణయాన్ని నిరసనకారులు హసీనా ప్రభుత్వంతో వారు చేసుకున్న పొత్తుగా భావించారు. అయినా కోర్టు తీర్పుతో నిరసనకారుల సంతృప్తి చెందలేదు. జరిగిన ఘర్షణల్లో 14 మంది పోలీసు అధికారులు, మరో 68 మంది మరణించారు. మాజీ ఆర్మీ చీఫ్ జనరల్ ఇక్బాల్ కరీం భుయాన్ ప్రజలవైపే నిలబడ్డారు. దళాలను ఉపసంహరించుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ హత్యలను ఖండించారు. ప్రస్తుత ఆర్మీ చీఫ్ వాకర్-ఉజ్-జమాన్ సాయుధ దళాలు ఎల్లప్పుడూ ప్రజల పక్షాన నిలుస్తాయని అని పేర్కొన్నారు. ఇక చివరి నిరసనగా ఢాకాకు లాంగ్ మార్చ్ చేయాలని పిలుపునిచ్చారు. ప్రధాని ఇంటిని కూడా ముట్టడించారు. దీంతో షేక్ హసీనా దేశాన్ని విడిచి వెళ్లిపోవాల్సి వచ్చింది

# పవన్ స్వరంలో మార్పు



విజయవాడ, ఆగస్టు 6 నాయకుడు.. పాలకుడుగా మారితే స్వరంలో మార్పు వస్తుంది. వ్యవహార శైలిలో మార్పు వస్తుంది.ఈ విషయంలో పవన్ కళ్యాణ్ ఒక ఉదాహరణ.జనసేన అధినేతగా పవర్ ఫుల్ వాయిస్ వినిపించారు పవన్.అదే పవన్ డిప్యూటీ సీఎం గా మారారు. 50 రోజుల కిందట బాధ్యతలు చేపట్టారు. కానీ మునుపటిలా ఆ స్వరం వినిపించడం లేదు. మాటల వేడి కూడా తగ్గింది. సినీ రంగంలో అనతి కాలంలోనే ఎదిగారు పవన్.తనకంటూ ఒక మేనరిజం ఏర్పాటు చేసుకున్నారు.అందుకే సక్సెస్ అయ్యారు. సినిమాల సక్సెస్ తో పని లేకుండా.. తెలుగు పరిశ్రమలో అగ్రనటుడుగా వెలుగొందారు. పవర్ స్టార్ అన్న బిరుదు దక్కించుకున్నారు. జనసేన పార్టీ స్థాపించిన తర్వాత కూడా అదే పవర్ ను కొనసాగించారు.2014 నుంచి 2019 వరకు ఆయన ప్రత్యక్ష ఎన్నికల్లో పోటీ చేయకపోయినా..బలమైన రెండు ప్రాంతీయ పార్టీలకు దీటుగా తన రాజకీయాన్ని నడిపించారు.2019లో పోటీ చేశారు. తాను పోటీ చేసిన రెండు నియోజకవర్గాల్లో ఓడిపోయారు. కేవలం ఒకే ఒక స్థానంలో తన పార్టీ గెలిచింది. అయినా సరే 151 స్థానాలు దక్కించుకున్న వైసీపీకి గత ఐదేళ్లుగా చుక్కలు చూపించారు.ఆయన ప్రజల్లోకి వచ్చిన ప్రతిసారి అప్పటి మంత్రులు,వైసీపీ నేతలకు నిత్యం పనే. పవన్ విమర్శలకు ఎలా తిప్పి కొట్టాలో తెలియక సతమతమయ్యేవారు. అంతలా అప్పుడు రాజకీయాలను శాసించారు పవన్. ఆయన నోటి నుంచి వచ్చే ప్రతి మాట తూటాలా మారేది. ప్రత్యర్థి గుండెలను చీల్చుకుంటూ పోయేది. అయితే అటువంటి వ్యక్తి చేతికి అధికారం వచ్చేసరికి సమూల మార్పులు ఉంటాయని అంతా భావించారు. కానీ గత 50 రోజుల్లో కేవలం సమీక్షలు,సమావేశాలు కొనసాగిస్తున్నారు.క్షేత్రస్థాయిలో ప్రజల్లోకి రావడం లేదుపవన్ డిప్యూటీ సీఎం తో పాటు నాలుగు మంత్రి పదవులను స్వీకరించి 50 రోజులు దాటుతోంది. కానీ గతం మాదిరిగా చురుకుతనం, పవర్ ఫుల్ నేతృత్వం కనిపించడం లేదు. అయితే అది అధికారంలో ఉన్నప్పుడు చెల్లదు కూడా. ఒక అధినేతగా పవర్ ఫుల్ నేతగా ఎదిగిన పవన్..అధికారం చేపట్టాక ఆ స్థాయిలో ప్రతాపం, ప్రభావం చూపలేకపోతున్నారు.చేతిలో ఆరు మంత్రిత్వ శాఖలు ఉన్నాయి. ఆపై డిప్యూటీ సీఎం హోదా ఉంది. అయినా సరే అధికార దర్పం చూపేందుకు పవన్ ఇష్టపడడం లేదు.వాస్తవానికి పవన్ కూటమి ప్రభుత్వంలో హోం మంత్రి పదవి నిర్వర్తిస్తారని అంతా భావించారు. సీఎం తరువాత అంతటి పెద్ద పదవి అదే. సహజంగానే జనసైనికులు సైతం హోం మంత్రి పదవిలో పవన్ ను చూడాలనుకున్నారు. కానీ పవన్ మాత్రం దర్పం కంటే..ప్రజలకు మెరుగైన పాలన అందించే శాఖల కే ఇష్టపడ్డారు.ముఖ్యంగా గ్రామీణ నేపథ్యం ఉన్న శాఖలను ఎంచుకున్నారు. పంచాయితీ రాజ్, గ్రామీణాభివృద్ధి,పర్యాటక, అటవీ శాఖ..ఇలా పల్లెపాలనకు సంబంధించిన అన్ని రకాల శాఖలను తన వద్ద ఉంచుకున్నారు.అయితే మంత్రిగా పదవీ బాధ్యతలు స్వీకరించిన తర్వాత పవన్ దూకుడు తగ్గింది. సహజంగానే ఇది జనసైనికులకు మింగుడు పడని అంశం.అందుకే పవన్ క్షేత్రస్థాయిలోపర్యటనలు చేయాలని వారు ఆశిస్తున్నారు. గతం మాదిరిగా సమకాలీన రాజకీయ అంశాలపై స్పందించాలని కోరుకుంటున్నారు. అయితే శాఖలపై పట్టు పెంచుకునేందుకు పవన్ ప్రయత్నిస్తున్నారు.తన చుట్టూ యువ, నిజాయితీ అధికారులను నియమించుకుంటున్నారు. ప్రతిపక్షం మాదిరిగా అధికారంలో ఉన్నవాళ్లు మాట్లాడడం కుదరని పనిగా తేల్చి చెబుతున్నారు. శాసనసభలో సైతం ఇదే విషయాన్ని ప్రకటించారు. తాను తప్పు చేసినా.. కఠిన చర్యలు తీసుకోవాలని నేరుగా స్పీకర్ నే కోరారు. ఒక విధంగా చెప్పాలంటే ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ప్రశ్నించే స్థాయిలో ఉంటారు. అధికారంలోకి వస్తే సమాధానం చెప్పాల్సి ఉంటుంది. ఈ విషయం తెలుసు కనుక పవన్ తనపని తాను చేసుకుంటున్నారు.అవసరమైతేనే మాట్లాడుతున్నారు.

## తమ్ముళ్లలో అసంతృప్తులు ..?

నెల్లూరు, ఆగస్టు 6 టీడిపిలో అసంతృప్తులు పెరుగుతున్నాయా? నేతల్లో ఒక రకమైన నిర్లిప్తత ప్రారంభమైందా? హై కమాండ్ పట్టించుకోకపోవడంతో కొంతమంది నేతలు బాధతో ఉన్నారా? అంటే అవుననే సమాధానం వినిపిస్తోంది. ఈసారి ఎన్నడూ లేని విధంగా ఎన్నికల్లో చాలామందికి ఛాన్స్ దక్కలేదు. జనసేన, బిజెపితో పొత్తు మూలంగా.. దాదాపు ఒక 50 మంది నాయకులు చాన్స్ కోల్పోయారు. అందులో హేమహేమి నాయకులు కూడా ఉన్నారు. చివరి నిమిషంలో చంద్రబాబు పిలిచి మాట్లాడేసరికి చాలామంది సీట్లు త్యాగం చేశారు. అటువంటి వారికి అధికారంలోకి వచ్చిన వెంటనే న్యాయం చేస్తానని చంద్రబాబు హామీ ఇచ్చారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 50 రోజులు దాటుతోంది. కానీ ఇంతవరకు అలా ఎదురు చూస్తున్న వారికి పిలుపు అందడం లేదు. ఫలానా పదవి ఇస్తామని కూడా చెప్పడం లేదు. దీంతో వారిలో ఆవేదన నెలకొంది. మరోవైపు నామినేటెడ్ పదవుల్లో జనసేన, బిజెపికి సైతం సర్దుబాటు చేస్తారని ప్రచారం జరుగుతోంది. దీంతో పదవులు ఆశిస్తున్న టిడిపి నేతల్లో ఒక రకమైన ఆందోళన కనిపిస్తోంది. అప్పట్లో అధినేత బుజ్జగించి.. తమను పక్కన పెట్టారని.. కానీ అధికారంలోకి వచ్చిన తర్వాత కనీసం పిలిచి కూడా మాట్లాడడం లేదన్న ఆవేదనతో సదరు నేతలు ఉన్నారు. దీంతో టీడీపీలో చిన్నపాటి అసంతృప్తి ప్రారంభమైనట్టు స్పష్టమవుతోంది. ఇది నివురు గప్పిన నిప్పులా మారకముందే.. మేల్కొనాల్సిన అవసరం ఉందిటిడిపిలో సీనియర్లు అయిన దేవినేని ఉమా, ఆలపాటి రాజేంద్రప్రసాద్, బుద్ధ వెంకన్న, అశోక్ గజపతిరాజు, దాడి వీరభద్రరావు, కొనకల్ల నారాయణ వంటి వారు ఎన్నికల్లో పోటీకి దూరంగా ఉన్నారు. అనేక జిల్లాల్లో నాయకులు పోటీకి సిద్ధమైన తరువాత చంద్రబాబు నుంచి పిలుపు వచ్చింది. ఈసారి పొత్తులో భాగంగా ఎక్కువ సర్దుబాట్లు చేయాల్సి వచ్చినందున న్యాయం చేయలేనని.. ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు. అయితే ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండు నెలలు సమీపిస్తోంది. కానీ అధినేత నుంచి భరోసా లేకపోవడంతో క్షేత్రస్థాయిలో నాయకులు అసంతృప్తితో రగిలిపోతున్నారుపవన్ కోసం పిఠాపురం సీటును వర్మ త్యాగం చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఎమ్మెల్సీ పదవి ఇచ్చి మంత్రిని చేస్తామని వర్మ కు హామీ ఇచ్చినట్లు ప్రచారం జరిగింది. అయితే ఇప్పుడు వర్మను పట్టించుకోవడం లేదన్న టాక్ నడుస్తోంది. ఇటీవల కార్యకర్తల సమావేశంలో సైతం తన ఆవేదనను వ్యక్తపరిచినట్లు సమాచారం. నాకే దిక్కులేదు నీకేం చేయగలను అంటూ నిట్టూర్చినట్లు తెలుస్తోంది. మరో సీనియర్ నేత బుద్ధ వెంకన్న పరిస్థితి కూడా అలానే ఉంది. పార్టీ కోసం పని చేస్తే పదవులు లేవు కదా.. కనీసం మాట కూడా చెల్లుబాటు కావడంలేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. అయితే ఈఇద్దరే కాదు చాలామంది ఇదే రీతిలో బాధపడుతున్నారు.టిడిపి కూటమి అధికారంలోకి రావడంతో పార్టీ నాయకులు ఆనందపడిపోయారు. తమకు నామినేటెడ్ పదవులు తప్పవని భావించారు. కానీ ఆ పదవుల్లో సైతం.. మూడు పార్టీలకు పంపకాలు చేపట్టాలని నిర్ణయం తీసుకున్నారు. ఎమ్మెల్సీ, రాజ్యసభ పదవుల్లో సైతం అదే ఫార్ములాను అనుసరించనున్నారు. ఇది కూడా టిడిపి నేతల్లో అసంతృప్తికి కారణమవుతోంది. చంద్రబాబు గుర్తించి సరిదిద్దుకుంటే పర్వాలేదు? లేకుంటే మాత్రం టిడిపిలో అసంతృప్తి జ్వాలలు పెరిగే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి.

# బిల్లులా... కేసులా....

### అంతు పట్టని అంతరంగం

విశాఖపట్టణం, ఆగస్టు 6 జయసాయిరెడ్డి బిజెపిలో చేరతారా? ఆ పార్టీ సేఫ్ జోన్ అని భావిస్తున్నారా? కేసులకు భయపడుతు న్నారా? అందుకే తరచూ కేంద్ర హోం మంత్రి అమిత్ షాను కలుస్తున్నారా? ఏపీ పొలిటికల్ సర్కిల్లో ఆసక్తికర చర్చ నడుస్తోంది. వారం రోజుల వ్యవధిలో విజయసాయిరెడ్డి అమిత్ షాను కలవడం రెండోసారి. సాధారణంగా అమిత్ షా అపాయింట్మెంట్ అంత ఈజీగా లభించదు. ఆయన కేంద్ర హోంమంత్రి తో పాటు బిజెపిలో కీలక నేత. పాలనాపరమైన అంశాలతో పాటు పార్టీ వ్యవహారాల్లో బిజీగా ఉంటారు. అటువంటి నేతతో వరుసగా విజయసాయిరెడ్డి భేటీలు జరుపుతుండడం పలు అనుమానాలకు తావిస్తోంది. వైసిపి కీలక నేతగా ఉన్న విజయసాయి రెడ్డి పై అనేక రకాల కేసులు ఉన్నాయి. వైసిపి హయాంలో భూకబ్జా చేశారన్న ఆరోపణలు కూడా ఉన్నాయి. ఇటీవల దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ శాంతి వ్యవహారంలో బలంగా ఆయన పేరు వినిపించింది. సొంత పార్టీలో సైతం ఆయనకు పెద్దగా ఎవరు అండగా నిలవలేదు. అయినా సరే పార్టీ అధినేత జగన్ వెంట నిత్యం కనిపిస్తున్నారు. మొన్నటికి మొన్న ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద జగన్ తలపెట్టిన ధర్నాకు.. జాతీయ స్థాయి నేతల సమీకరణ దగ్గరుండి చూశారు విజయసాయిరెడ్డి. కానీ ఆ ధర్నాకు హాజరయ్యింది ఎన్డీఏ వ్యతిరేక పక్షాలు. ముఖ్యంగా బిజెపిని వ్యతిరేకించే పార్టీల నేతలే అక్కడకు వచ్చారు. అదే సమయంలో విజయసాయిరెడ్డి ఎన్ డి ఏ విధానాలను తప్పుపడుతూ మాట్లాడారు కూడా. ప్రతిపక్షాలకు లోక్ సభ డిప్యూటీ స్పీకర్ పదవి కేటాయించాలని కూడా కోరారు. అయితే ఒకవైపు ఎన్డీఏ, బిజెపి వ్యతిరేక వ్యాఖ్యానాలు చేస్తూనే.. బిజెపి అగ్ర నేతలను వరుసగా కలుస్తుండడం హాట్ టాపిక్ గా మారింది.విజయసాయిరెడ్డి బిజెపి అగ్రనేతల ఆగ్రహాన్ని తగ్గించేందుకే తరచూ కలుస్తున్నారన్న ప్రచారం జరుగుతోంది. వైసిపి ఇండియా కూటమికి దగ్గరైనట్లు వార్తలు వస్తున్నాయి. ఆ కూటమి జాతీయ నాయకులు సైతం జగన్ కు అండగా నిలిచారు. ఏపీలో టీడీపీ కూటమిలో బిజెపి ఉండడంతో.. జగన్ సైతం జాతీయస్థాయిలో ఎన్డీఏ కూటమికి వ్యతిరేకంగా మారాల్సిన అవసరం ఏర్పడింది. అదే సమయంలో తనపై అక్రమాస్తుల కేసులు మళ్లీ తెరపైకి వస్తే ఇబ్బందికర పరిస్థితులు ఎదుర్కోవాల్సి ఉంటుంది. వీటన్నింటిపై చర్చించేందుకే బిజెపి అగ్ర నేతలను విజయసాయిరెడ్డి కలుస్తున్నారని టాక్ నడుస్తోంది.మరోవైపు వైసీపీ రాజ్యసభ సభ్యుల వ్యవహారంపై ప్రత్యేక కథనాలు వస్తున్నాయి. వారికి కూటమి నేతలు టచ్ లోకి వచ్చినట్లు సాక్షిలో ప్రత్యేక కథనం వచ్చింది. రాజ్యసభ సభ్యులకు కొనుగోలు వ్యవహారం జరుగుతోందని అనుమానిస్తూ వైసీపీ మీడియా ప్రత్యేక కథనాలు ప్రచురిస్తుండడం విశేషం. సరిగ్గా ఇదే సమయంలో విజయసాయిరెడ్డి అమిత్ షా ను కలవడం వైసీపీకి షాక్ ఇచ్చే విషయమే. ఒక్కో ఎంపీ కి 50 నుంచి 70 కోట్ల రూపాయలు చెల్లించి కొనుగోలు చేసేందుకు ప్లాన్ చేస్తున్నారన్నది ఈ కథనం సారాంశం. సొంత పత్రికలోనే ఈ కథనాలు రావడంతో వైసీపీలో సైతం ఒక రకమైన ఆందోళన నెలకొంది.రాజ్యసభలో వైసిపి పక్ష నేతగా విజయసాయిరెడ్డి ఉన్నారు. ప్రస్తుతం వైసీపీకి రాజ్యసభలో 11 మంది సభ్యుల బలం ఉంది. జగన్ ధైర్యం కూడా వీరే. అదే సమయంలో కొద్ది రోజులపాటు రాజ్యసభలో బిజెపికి బలం ఆశించిన స్థాయిలో ఉండదు. త్వరలో జరిగే ఎన్నికలతో రాజ్యసభలో బిజెపికి అవసరమైన ప్రాతినిధ్యం పెరుగుతుంది. అయితే అత్యవసరంగా కొన్ని కీలక బిల్లులు ఆమోదం పొందాల్సి ఉంది. అందుకే విజయసాయిరెడ్డిని అమిత్ షా పిలిపించుకొని మాట్లాడినట్లు సమాచారం. మొత్తానికి అయితే విజయసాయిరెడ్డి కేంద్ర పెద్దలను వరుసగా కలుస్తుండడం రకరకాల అనుమానాలకు తావిస్తోంది.

## శ్రీ కోదండరామ స్వామి ఆలయంలో హుండీ చోరీ

**గతంలో కూడా పలుసార్లు ఆలయంలో చోరీలు, సీసీ కెమెరాలు పర్యవేక్షణ లోపం....**

తిరుపతి,తిరుపతి జిల్లా చంద్రగిరి నియోజకవర్గం పాకాల మండలం దామలచెరువు శ్రీ కోదండరామస్వామి ఆలయంలో రాత్రి హుండీ చోరీ జరిగింది.గతంలో కూడా పలుసార్లు ఆలయం లో చోరీలు జరిగాయి,సీసీ కెమెరాలు పర్యవేక్షణ లేకపోవడం వల్ల ఈ చోరీలు జరుగుతున్నాయని స్థానికులు పేర్కొన్నారు. గత నెలలోనే ఆలయ హుండీ లెక్కింపు జరిగిందని అన్నారు.సుమారు 5000 నుండి 7000 రూపాయల వరకు ఉండొచ్చని ఆలయ సిబ్బంది తెలిపారు.స్థానిక పాకాల పోలీసులు సంఘటనానికి వెళ్లి పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# కూలిపోయిన సినిమా చెట్టు...

రాజమండ్రి, ఆగస్టు 6 గోదారి గట్టుంది...గట్టుమీద చెట్టు ఉంది..చెట్టుకొమ్మన పిట్టుంది పాట విన్నాం కదా ఆ చెట్టు ఏదో కాదు..వందలాది సినిమాల్లో కనిపించి సినిమా చెట్టుగా యమ ఫేమస్ అయిన తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరు మండలంలోని కుమారదేవం గ్రామంలో ఏటిగట్టును ఉన్న నిద్రగన్నేరు చెట్టే. గోదావరి బ్యాక్‌డ్రాప్‌లో వచ్చే ఏ సినిమాలో అయినా సరే క్యారెక్టర్ ఆర్టిస్టులు ఉన్నా లేకపోయినా... ఈ చెట్టు క్యారెక్టర్ మాత్రం ఉండాల్సిందే. అంత ఫేమస్ అయిన ఈ సినిమా చెట్టు శాశ్వతంగా షూటింగ్‌లకు పేకప్ చెప్పేసింది. గోదావరి వరదలకు కుప్పకూలిపోయింది.పాతతరం మూగమనసులు నుంచి నేటితరం రంగస్థలం వరకు వందకుపైగా సినిమాల్లో కనిపించి గోదావరి ఏటిగట్టును అందంగా మార్చిన తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరు మండలంలోని కుమారదేవం గ్రామంలోని సినిమా చెట్టు కూలిపోయింది. దాదాపు శతాబ్ధంన్నర పాటు గ్రామప్రజలకు నీడనివ్వడమేగాక...వందకు పైగా చిత్రాల్లో కనిపించి గోదావరి జిల్లావాళ్లకే కాదు ప్రపంచవ్యాప్తంగా అభిమానులను సంపాదించుకున్న సినిమా చెట్టు(శాశ్వతంగా కనుమరుగైంది. గోదావరి వరదలకు ఏటిగట్టు కోతకు గురవ్వడంతో ఈ చెట్టు నిట్టనిలువుగా చీలిపోయి పడిపోయింది.

సినిమా షూటింగ్‌లకు ఫేమస్

పాతతరం సినిమాల్లో గోదావరి అందాలను చూపించాలన్నా...హీరో కోసం హీరోయిన్ ఏటివైపు ఎదురుచూడాలన్నా...బ్యాక్‌డ్రాప్‌లో ఈ చెట్టు ఉండాల్సిందే. మూగమనసులు చిత్రంలో జమున( ఆడిపాడింది ఈ చెట్టుకిందే. అలాగే సీతారామయ్యగారి మనుమరాలు చిత్రంలో సమయానికి తగు మాటలాడి పాట మొత్తం ఈ చెట్టు కిందే చిత్రీకరించారు. ఇలా చెప్పుకుంటూ పోతే ఈ చెట్టు కింద తీసిన చిత్రాల జాబితా వందకు పైగా చేరుతుంది. కళాతపస్వి విశ్వనాథ్, అగ్రదర్శకులు దాసరి, రాఘవేంద్రరావు,జంధ్యాలతోపాటు తూర్పుగోదావరి జిల్లా వాసి అయినటువంటి ఈవీవీ సినిమాల్లో ఈ చెట్టును చాలా అందంగా చూపించారు. గలగలపారే గోదావరి ఏటి సవళ్లు ఒకవైపు ఆ పక్కనే గట్టుమీద విశాలమైన పచ్చని నిద్రగన్నేరు చెట్టు...దాని కింద అరుగు. ఇంతకన్నా గోదావరి పల్లెను అందంగా చూపించడానికి ఏం ఉంటుంది. అందుకే ప్రతి ఒక్క సినీ దర్శకుడు కనీసం ఒక్క సీను అయిన ఈ చెట్టుకింద, దీని పరసరాల్లో తీయాలని అప్పట్లో ఉవ్విళ్లూరేవారు. పెద్దపెద్ద హీరోలు సైతం ఈ చెట్టుకింద నటించారు. ఇక గోదావరి అంటే పడిచచ్చిపోయే వంశీ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. ఆయనకు గోదావరి అన్నా...ఆ ఏటిగట్లు అన్నా, ఆ పల్లెలన్నా వల్లమాలిన పిచ్చి. ఇక ఇంత ఫేమస్ అయిన ఈ సినిమా చెట్టును ఎందుకు వదులుతాడు. అందుకే ఆయన ఏకంగా ఈ చెట్టుకింద 18 సినిమాలు చిత్రీకరించాడంటే ఆ చెట్టు అంటే ఆయనకు ఎంత ప్రాణమో చెప్పాల్సిన పనిలేదు. వంశీ ఈ ప్రాంతానికి వస్తే చాలు షూటింగ్ లేకపోయినా ఆ చెట్టుకిందకు చేరి మధ్యాహ్న భోజనం అక్కడే చేసేవాడంటే ఈ చెట్టంటే ఆయనకు ఎంత ప్రాణమో చెప్పాల్సిన పనిలేదు. ఏటిగట్టు పైనుంచి గోదావరిలో పారే నీటిని తాకుతూ ఉండే ఈ చెట్టు కొమ్మలు చూస్తుంటే ఎంతో చూడముచ్చటగా ఉంటుందని వంశీ చెప్పేవారన్నారు.

రక్షణ కరవు

సినిమా చెట్టుగా ఎంతో ఫేమస్ అయిన ఈ చెట్టును రక్షించాలని...వరద తాకిడికి ఏటిగట్టు కోతకు గురవ్వకుండా చుట్టూ రాతికట్టడం కట్టించాలని ఈ గ్రామప్రజలు ఎన్నోసార్లు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. దశాబ్దాల తరబడి ఎన్నో చిత్రాల్లో కనిపించి కనువిందు చేసిన ఈ చెట్టును కాపాడుకుని పర్యాటకంగా తీర్చిదిద్దాలని కోరారు. అయినప్పటికీ పాలకులు పట్టించుకోకపోవడంతో ఇటీవల కురిసిన వర్షాలకు వరదనీరు పోటెత్తి...గోదావరి ఏటిగట్టు కోతకు గురైంది. దీంతో ఈ సినిమా చెట్టు నిట్టనిలువుగా చీలిపోయి కూలిపోయింది.ఈ సినిమా చెట్టును 150 ఏళ్ల క్రితం గ్రామానికి చెందిన శింగులూరి తాతబ్బాయి అనే వ్యక్తి నాటాడని గ్రామస్తులు చెప్పారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు ఈ చెట్టును గ్రామస్తులు సంరక్షించుకుంటూ వస్తున్నారు. గోదావరికి ఎన్నో వరదలు వచ్చినా, భీకరగాలులు వీచినా చెక్కుచెదరని ఈ చెట్టు...ఏటిగట్టు కోతకు గురవ్వడంతో కూకటి వేళ్లతో సహా కూలిపోయింది.

## డ్రమ్ములో శవం స్టోరీ...కథ చాలా ఉంది

కర్నూలు, ఆగస్టు 6 కర్నూలు జిల్లా ఆస్పరి మండలం చిన్న హోతూరు గ్రామంలో గత నెల 28న డ్రమ్ములో శవం లభ్యమైంది. ఈ హత్యఆస్పరి పోలీసులకు సవాల్‌గా మారింది. కొందరు గుర్తుతెలియని వ్యక్తులు ఆటోలో వచ్చి డ్రమ్ము పడేసి పోయారన్న సమాచారంతో తీగలాగినన పోలీసుల విచారణలో సంచలన విషయాలు వెలుగులోకి వచ్చాయి. అవి పోలీసులకే షాక్ ఇచ్చాయి. ఎమ్మిగనూరు మండలం మసీదుపురం గ్రామానికి చెందిన పేటయ్య, నరసింహుడు ఇద్దరు స్నేహితులు. పేటయ్య తనకున్న స్థలం అమ్మి 7,50,000 రూపాయలు తన దగ్గర ఉంచుకున్నాడు. ఎలాగైనా ఆ సొమ్మును కొట్టేయాలని నరసింహుడు ఆలోచించాడు. పేటయ్యకు మాయ మాటలు చెప్పి దొంగ నోట్లు ఇప్పిస్తానని హోలెబీడు గ్రామానికి చెందిన హనుమంతు, పంపన్న దగ్గరకు తీసుకెళ్లాడు. అందరూ అప్పటికే భారీ స్కెచ్ వేశారు. అనుకున్నట్టుగానే గత నెల 25న పేటయ్యకు సైనేడ్ కలిపిన మద్యం బలవంతంగా తాగించి హత్య చేశారు. ఆ తర్వాత ఆ శవాన్ని పంపన్న పొలంలో ఉన్న షెడ్ దగ్గర పూడ్చిపెట్టారు. అక్కడ దుర్వాసన రావడంతో ఆ శవాన్ని బయటకు తీసి ఓ ప్లాస్టిక్ డ్రమ్ములో పెట్టి చిన్న హోతురు గ్రామ సమీపంలో ఉన్న వంకలో పడేసి పోయారు.డ్రమ్ములో నుంచి వాసన వస్తుండడంతో స్థానిక ప్రజలు పోలీసులకు సమాచారం అందించారు. ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు డ్రమ్మును ఓపెన్ చేసి చూడగా అందులో శవం కనిపించింది. ఆశ్చర్యపోయిన పోలీసులు అది మర్డర్‌గా అనుమానించి విచారణ చేపట్టారు. విచారణలో తన ప్రాణ స్నేహితుడే పేటయ్యను కిరాతకంగా చంపి ఈ ఘటనకు పాల్పడినట్లు పోలీసులు పేర్కొన్నారు. పేటయ్య హత్యకు పాల్పడిన నరసింహుడు, హనుమంతు, పంపన్నను పోలీసులు అదుపులోకి తీసుకొని విచారించగా గతంలో నరసింహుడు తండ్రినే చంపిన కేసులో నిందితుడు. తండ్రి ఉద్యోగం కోసం ఈ పని చేశాడని తేలింది. మాజీ నక్సలైట్ అని జనాన్ని హనుమంతు బెదిరించిన డబ్బులు దండుకుంటున్నాడని పోలీసులు తెలిపారు. వారి నుంచి 7 లక్షల 50 వేల రూపాయలు రికవరీ చేసి కోర్టులో హాజరు పరిచి రిమాండ్ కు తరలించారు.

# బూడిద చెరువుకు గండి

నెల్లూరు, ఆగస్టు 6, నెల్లూరు జిల్లాలో థర్మల్ పవర్ ప్రాజెక్టుకు చెందిన బూడిద చెరువుకు గండి పడింది. దీంతో నీటితో కలిసిన బూడిద దిగువ ప్రాంతాలకు చేరింది. పంట పొలాలను బూడిద కమ్మేసింది. ప్రజలు తీవ్ర భయాందోళన వ్యక్తం చేస్తు?న్నారు. శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలో శనివారం బూడిద చెరువుకు గండి పడింది. జిల్లాలోని కృష్ణపట్నం పోర్టు సమీపంలోని దామోదరం సంజీవయ్య థర్మల్ పవర్ ప్రాజెక్టు (ఏపీ జెన్‌కో)కు చెందిన యాష్‌పాండ్ (బూడద చెరువు)కు గండిపడటంతో ప్రజలు ఆందోళనల్లో ఉన్నారు. బూడిద చెరువుకు గండిపడటంతో బూడిద నీరు సమీప పొలాలను ముంచెత్తుతోంది. ఈ చెరువుకు దిగువన ఉన్న సమీప గ్రామాల్లో ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.ఈ థర్మల్ పవర్ ప్రాజెక్టులో ప్రతి రోజు బొగ్గు ఆధారంగా 1,600 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి జరుగుతోంది. విద్యుత్ ఉత్పత్తిలో వినియోగించిన బొగ్గు, వినియోగం అయిపోయిన తరువాత నీరు, నల్ల బూడిద కలిసి పైపుల ద్వారా బయటకు వస్తుంది. ఈ బూడిదను నిల్వ చేయడానికి 300 ఎకరాల్లో యాష్‌పాండ్ (బూడిద చెరువు)ను ఏర్పాటు చేశారు. ఆ నీటితో కలిసిన నల్ల బూడిద పైపుల ద్వారా ఆ చెరువులోకి వచ్చి పడుతోంది. అయితే బూడిద చెరువు కట్టలు బలహీనంగా ఉండటంతో శనివారం సాయంత్రం 6.30 గంటల సమయంలో ఏకంగా 16 అడుగుల కట్ట తెగిపడింది. ఈ ఇది బూడిద చెరువుకు ఎడమవైపు గండికొట్టింది. దీంతో నీటితో కలిసిన నల్ల బూడిద చెరువుకు దిగువుకు కొట్టుకుపోతుంది.ఆయుదాలపాడు, మిట్టపాలెం, ముసునూరివాని పాలెం తదితర గ్రామాల పొలాల్లోకి బూడిద నీరు కొట్టుకురావడంతో పొలాలన్నీ బూడిదతో నిండిపోయాయి. పంటనష్టం జరిగే అవకాశం ఉందని రైతులు, సమీప గ్రామాల ప్రజలు తీవ్ర భయాందోళనల తో ఉన్నారు. అయితే సమాచారం తెలుసుకున్న జెన్‌కో అధికారులు చెరువు వద్దకు చేరుకుని పరిశీలించారు. గండిని పూడ్చే పని చేపట్టారు. అయితే శనివారం అర్ధరాత్రి వరకు గండి పూడ్చలేకపోయారు. దీంతో ప్రవహిస్తున్న బూడిద గ్రామాలను, పొలాలను చుట్టేస్తోంది. ఎప్పుడు ఏం జరుగుతోందనని ఆయా గ్రామాల ప్రజలు బిక్కుబిక్కుమంటున్నారు.దీంతో శనివారం అర్ధరాత్రి అయినప్పటికీ గండిపూడ్చలేకపోయారు అధికారులు. ఈ బూడిద పొలాలను నాశనం చేస్తుందని, పంటలు నష్టపోతాయని రైతులు, ప్రజలు అంటున్నారు. బూడిద చెరువు కట్ట బలహీనంగా ఉండటాన్ని ముందుగా గ్రహించకపోవడంతోనే ఈ విపత్తు తలెత్తిందని స్థానిక ప్రజలు అంటున్నారు. గండిని వెంటనే పూడ్చాలని, తమకు న్యాయం చేయాలని కోరుతున్నారు. ఆదివారం ఉదయం గండి పూడ్చే పనులు చేపట్టారు అధికారులు.

# కోట్ల కామ్ అయిపోయారే...

కర్నూలు, ఆగస్టు 6,కోట్ల సూర్య ప్రకాశ్ రెడ్డి మాజీ ముఖ్యమంత్రి కుమారుడు. ప్రస్తుతం ఆయన ఒక ఎమ్మెల్యేగా కొనసాగుతున్నారు. డోన్ నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. టీడీపీ లో చేరిన కోట్ల సూర్య ప్రకాశ్ రెడ్డి తన కుటుంబ గౌరవం, ప్రతిష్ట కోసమైనా తనకు మంత్రి పదవి దక్కుతుందని భావించారు. డోన్ లో గెలిచి చంద్రబాబు మంత్రివర్గంలో చోటు దక్కుతుందని గట్టిగా భావించారు. కానీ ఆయనకు కొన్ని కారణాల రీత్యా చంద్రబాబు మంత్రివర్గంలో స్థానంల దక్కలేదు. దీంతో ఆయన సాధారణ ఎమ్మెల్యేగానే మిగిలిపోయారు. నిజానికి ఆయన అనుకున్నది వేరు. జరుగుతున్నది వేరు. దీంతో అసలు కోట్ల సూర్య ప్రకాశ్ రెడ్డి టీడీపీలో ఉన్నారా? అన్న అనుమానం కూడా కలుగుతుంది. కోట్ల సూర్య ప్రకాశ్ రెడ్డి ప్రజలతో త్వరగా కలసిపోడన్న పేరున్నా .. ఆయన చాలా రోజుల తర్వాత శాసనసభకు పోటీ చేశారు. నిజానికి ఆయన కర్నూలు పార్లమెంటుకు పోటీ చేయాలని ఉన్నా.. చంద్రబాబు డోన్ టిక్కెట్ ఇవ్వడంతో తప్పని సరి పరిస్థితుల్లో ఆయన శాసనసభకు పోటీ చేయాల్సి వచ్చింది. ఆయన ఎన్నికల వేళ నేరుగా కూడా ప్రజలతో చెప్పారు. తాను కర్నూలు పార్లమెంటుకు పోటీ చేయాల్సి ఉ ందని, అయితే అనివార్య కారణాలతో పోటీ చేయలేకపోయానని కన్నీటి పర్యతంతమయ్యారు. అంటే చంద్రబాబు అధికారంలోకి వచ్చినా తనకు మంత్రి వర్గంలో స్థానం దక్కదని ఆయన ముందే ఊహించారా? అన్న ప్రశ్న తలెత్తుతుంది.. నిజానికి కోట్ల సూర్య ప్రకాశ్ రెడ్డి ఎప్పుడూ శాసనసభ వైపు చూడలేదు. ఢిల్లీ వైపు ఆయన చూపు ఉంటుంది. పార్లమెంటు సభ్యుడిగా ఉంటే ఆ గౌరవం వేరు అని ఆయన భావిస్తారు. కుటుంబానికి ఉన్న ప్రతిష్టతో పాటు గౌరవం కూడా నిలబడుతుందని ఆయన ఆశిస్తారు. కానీ ఈసారి మాత్రం అలా జరగక పోవడంతో డోన్ నియోజకవర్గంలో ఆయన తప్పనిసరి పరిస్థితుల్లో పోటీ చేయాల్సి వచ్చింది. తీరా గెలిచిన తర్వాత కనీసం మంత్రి పదవి అయినా దక్కుతుందని భావిస్తే అది కూడా దక్కలేదు. కర్నూలు జిల్లా నుంచి టీజీ భరత్, బీసీ జనార్ధన్ రెడ్డిలు మంత్రులుగా ఎంపిక చే?సుకోవడంతో కోట్ల సాధారణ ఎమ్మెల్యేగానే మిగిలిపోయారు. దీంతో పాటు కోట్ల సూర్య ప్రకాశ్ రెడ్డికి మంత్రివర్గంలో స్థానం కల్పిస్తే కేఈ వర్గం కూడా గుర్రుమంటుందని చంద్రబాబు భావించి ఉండవచ్చు. అది కూడా ఆయనకు మైనస్ పాయింట్ గా మారిందనే చెబుతారు. అందుకే ఇటు కేఈ కుటుంబంలో గెలిచిన శ్యాంబాబుకు గాని, కోట్ల సూర్య ప్రకాశ్ రెడ్డికి గాని మంత్రి పదవి ఇవ్వకుండా చంద్రబాబు రెండు కుటుంబాలను పక్కనపెట్టారంటారు. ఈ నేపథ్యంలో కోట్ల సూర్య ప్రకాశ్ రెడ్డి గెలిచిన తర్వాత యాక్టివ్ గా లేరు. ఆయన మాటే వినిపించడం లేదు. కేవలం డోన్ నియోజకవర్గానికే పరిమితమయ్యారు. కర్నూలు జిల్లా రాజకీయాలకు కూడా ఆయన దూరంగా ఉండాలని నిర్ణయించుకున్నట్లు ఆయన సన్నిహితులు చెబుతున్నారు. గెలిచి కూడా ఇంత నిరాశలో ఉన్నది కోట్ల సూర్య ప్రకాశ్ రెడ్డి మాత్రమేనంటూ కామెంట్స్ వినపడుతున్నాయి.

# మీర్ పేట్ మిస్సింగ్ కేసు సుఖాంతం


తిరుపతి,హైదరాబాద్ మీర్ పేట్ పీఎస్ పరిధిలో రెండ్రోజుల క్రితం నమోదైన మిస్సింగ్ కేసును పోలీసులు చేధించారు. .ఎట్టకేలకు తిరుమలలో పన్నెండేళ్ల బాలుడి ఆచూకీ దొరికింది. .ఆదివారం సాయంత్రం 5 గంటల సమయంలో ఇంటి నుంచి బయటకు బాలుడు కాచిగూడ రైల్వే స్టేషన్ చేరుకుని తిరుపతి కి వచ్చాడు. ఇంటి నుంచి వచ్చే సమయంలో దాచుకున్న రూ. 1000 వెంట తెచ్చుకున్నాడు.

తిరుమల శ్రీవారి దర్శనం కోసం ఒంటరిగానే వచ్చి నిన్న శ్రీవారిని దర్శించుకున్నాడు. .ప్రస్తుతం తిరుపతి ఈస్ట్ పిఎస్ లో వున్నాడు. .. తల్లిదండ్రులకు మధుసూదన్ రెడ్డి, కవిత తో ఫోన్ లో మాట్లాడాడు. పోలీసులు బాలుడిని హోం కు తరలించి అక్కడి నుంచి తల్లిదండ్రులకు అప్పగించనున్నారు. ఇప్పటికీ 15 సార్లు తల్లిదండ్రులు బంధువులతో కలిసి శ్రీవారిని దర్శించుకున్నట్లు చెబుతున్నాడు.

# జగన్ కు రాజ్యసభ సభ్యులు ఝలక్...

విజయవాడ, ఆగస్టు 6,అటు తెలంగాణలో కేసీఆర్, ఇటు ఏపీలో జగన్ అధికారం శాశ్వతమన్నట్లు వ్యవహరించారు. పాలనలో వన్ మాన్ షో చేసిన ఆ ఇద్దరికి తెలుగు ప్రజలు గట్టిగానే బుద్ధి చెప్పారు. ఆ ఎఫెక్ట్‌తో తెలంగాణలో బీఆర్ఎస్ ఖాళీ అయిపోతుంది. అదే సీన్ ఏపీలో వైసీపీ విషయంలో కూడా రిపీట్ అయ్యే పరిస్థితి కనిపిస్తుంది. వైసీపీకి ఆ పార్టీ రాజ్యసభ సభ్యులు షాక్ ఇవ్వబోతున్నారన్న ప్రచారం జరుగుతుంది. అయితే ప్రస్తుతం వైసీపీలో ఉన్న ప్రజాప్రతినిధుల్ని చేర్చుకోవడానికి టీడీపీ, జనసేనలు సిద్ధంగా లేవు. దాంతో పార్టీ మారాలని చూస్తున్న వైసీపీ నేతలు కొత్త రూటు పడుతున్నారంట.వైసీపీకి త్వరలో ఆ పార్టీ రాజ్యసభ ఎంపీలు ఝలక్ ఇవ్వడం ఖాయమన్న ప్రచారం జరుగుతుంది. రానున్న రోజులలో జగన్‌కు భారీ షాక్ తప్పదని అంటున్నారు. వైసీపీకి రాజ్యసభలో 11 మంది, లోక్ సభలో నలుగురు ఎంపీలు ఉన్నారు. వారిలో మెజారిటీ రాజ్యసభ సభ్యులు పార్టీ మారేందుకు సిద్ధం అవుతున్నారని తెలుస్తోంది. ప్రస్తుతం కేంద్రంలో ఎన్డీఏ సర్కారుకి రాజ్యసభలో అవసరమైన బలంలేదు. కేంద్రం ప్రవేశ పెట్టిన బిల్లులు రాజ్యసభ బిల్లులు రాజ్యసభ ఆమోదం పొందాలంటే ఎన్డీఏలో లేని పార్టీల మద్దతు కూడా తీసుకోవాల్సిన పరిస్థితి ఉంది.ఎన్డీఏ సర్కారుకి రాజ్యసభలో బయట పార్టీల మద్దతు అవసరమైన నేపథ్యంలో వైసీపీకి ఉ న్న 11 మంది, బీఆర్ఎస్‌కు ఉన్న నలుగురు రాజ్యసభ సభ్యులు కీలకంగా మారారు. ఎన్డీఏ కూటమిలో లేకపోయినా బీఆర్ఎస్, వైసీపీలు తాము అధికారంలో ఉన్నప్పుడు అంశాల వారీ మద్దతంటూ.. మోడీ సర్కారుకు అన్ని విధాలా సహకరించాయి. అయితే ఈ సారి అలా బయట నుంచి మద్దతు తీసుకోవడం కంటే. ఎంపీలను పార్టీలో చేర్చుకోవడమే మేలని బీజేపీ పెద్దలు భావిస్తున్నారంట.ఏపీలో టీడీపీ, జనసేనలకు వైసీపీ వాసన అంటేనే గిట్టదు. ఇప్పుడా రెండు పార్టీలు ఎన్డీఏ ప్రభుత్వంలో కీలకంగా ఉ న్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో వైసీపీ రాజ్యసభ ఎంపీల మద్దతు తీసుకుంటే.. కూటమిలో బీజేపీ పరిస్థితి డెలిగేట్‌గా మారుతుంది. అందుకే బయటనుంచి మద్దతు కంటే. వైసీపీ ఎంపీల్ని కలిపేసుకోవడమే బెటర్ అని బీజేపీ బాస్‌లు భావిస్తున్నారంట. గతంలో టీడీపీ రాజ్యసభ పక్షాన్ని విలీనం చేసుకున్నట్లు వైసీపీని మెర్జ్ చేసుకోవాలని చూస్తున్నారంట. అదే సమయంలో జగన్ తీరుతో తీవ్ర అసంతృప్తి, అసహనంతో ఉన్న పలువురు వైసీపీ ఎంపీలు బీజేపీతో టచ్ లోకి వెళ్లారంటున్నారు.పరాజయం పాలైనా వైసీపీ అధినేత జగన్ స్టైల్ మారడం లేదన్న అసంతృప్తి ఎంపీల్లో కనిపిస్తోందంటున్నారు. వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు తాడేపల్లి ప్యాలెస్‌లోకి నలుగురైదుగురికే డైరెక్ట్ ఎంట్రీ ఉండేది. సజ్జల, వైవీ సుబ్బారెడ్డి, పెద్దిరెడ్డి, విజయసాయి వంటి వారు మాత్రమే డైరెక్ట్‌గా జగన్‌తో మాట్లాడగలిగే వారంటారు. ఇక మిగిలిన మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు జగన్‌ని కలవాలంటే అపాయింట్‌మెంట్ కోసం పడిగాపులు పడాల్సి వచ్చేది. ఇప్పుడు ఓడిపోయాక కూడా జగన్ అదే వైఖరి ప్రదర్శిస్తుండటం రాజ్యసభ ఎంపీలకు మింగుడుపడటం లేదంట.నలభైఅయిదు రోజుల వ్యవధిలో జగన్ నాలుగో సారి బెంగళూరు ప్యాలెస్‌కు వెళ్లిపోయారు. దాంతో ఆయన ఎప్పుడు తాడేపల్లిలో ఉంటారో? ఎప్పుడు యలహంక కోటకు వెళ్తారో? అంతుపట్టక అసలు పార్టీ భవితవ్యం ఏంటో అర్థంకాక ఎంపీలు తమ రాజకీయ భవిష్యత్తుపై బెంగ పెట్టుకుంటున్నారంట. రాష్ట్రంలో శాంతి భద్రతలు అద్వానం అంటూ జగన్ ఇటీవల ఢిల్లీలో నిర్వహించిన ధర్నా అట్టర్ ఫ్లాప్ కావడం, గత ఐదేళ్లలో ఇష్టారాజ్యంగా నాయకులు దోచుకున్నట్లు రోజుకోక కుంభకోణం బయటపడుతుండటంతో వైసీపీ నేతల్లో భయాలు మొదలయ్యాంట.ఇటీవలి ఎన్నికల్లో వైసీపీ ఘోర పరాజయానికి కారణం జగన్ వైఖరే అన్న అభిప్రాయం వ్యక్తమవుతుంది. దాంతో ఇక ఆయనతో ఉంటే తమ ఫ్యూచర్‌కే ప్రమాదమని వైసీపీ ఎంపీలు పార్టీ మారే యోచనలో ఉన్నారంటున్నారు. ఇంకా వైసీపీతో, జగన్ తో అంటకాగితే రాజకీయ జీవితం సమాధి కావడం తప్ప మరో ప్రయోజనం ఉండదని భావిస్తున్నారంట.. అయితే వారు టీడీపీ, జనసేనల వైపు ఆశగా చూస్తున్నా అటు నుంచి ఎలాంటి పాజిటివ్ సంకేతాలు రావడం లేదంట.తెలుగుదేశం, జనసేనలతో టచ్ లోకి వెళ్లేందుకు దారులు కనపడక .. బీజేపీ ద్వారా ఆ పార్టీలకు దగ్గర కావాలన్న ప్రయత్నాలు మొదలెట్టారని అంటున్నారు. వైసీపీ రాజ్యసభ సభ్యులు టీడీపీ, జనసేనల్లో ఏ పార్టీ తీర్థం పుచ్చుకున్నా రాజ్యసభలో ఎన్డీఏ సర్కారుకి ప్లస్సే అందుకే బీజేపీ నేతలు కూడా రాయబారం నడిపే పరిస్థితి కనిపిస్తుంది. ప్రస్తుతం రాజ్యసభలో 11 మంది ఎంపీలు ఉన్న వైసీపీకి 8 మంది హ్యాండ్ ఇస్తే ఇక పార్టీ విలీనమైనట్లే.. మొత్తమ్మీద త్వరలోనే జగన్‌కి రాజ్యసభ ఎంపీల షాక్ తగలబోతుందన్న అభిప్రాయం వ్యక్తమవుతుంది.

# భారత దేశానికి జాతీయ గీతాన్ని అందించిన కవి రవీంద్రనాథ్ ఠాగూర్



## -నేడు ఆయన వర్ధంతి

భారత దేశానికి జాతీయ గీతాన్ని అందించిన కవి రవీంద్రనాథ్ ఠాగూర్.. వంగదేశంలో 1861 మే 7 వ తేదీన దేవేంద్రనాథ ఠాగూర్, శారదాదేవీలకు పద్నాలుగవ సంతానంగా రవీంద్రనాథ్ ఠాగూర్ జన్మించాడు. ఠాగూర్ గానూ, రవీంద్రుని గాను ప్రసిద్ధుడైన ఈయన తన గీతాంజలి కావ్యానికి సాహిత్యంలో నోబెల్ బహుమతిని అందుకున్నాడు. నోబెల్ బహుమతిని అందుకున్న మొట్టమొదటి ఆసియావాసి ఈయనే. రవీంద్రుడు కేవలం రచయితగానే ఉండిపోక, బాలల హృదయాలను వికసింపచేయటానికై ప్రాచీన మునుల గురుకులాల తరహాలోనే శాంతినికేతన్‌గా ప్రసిద్ధి గాంచిన విశ్వభారతి విశ్వవిద్యాలయాన్ని స్థాపించాడు. అది అయిదుగురు విద్యార్థులతో మొదలై, క్రమంగా విస్తరించింది. చిన్న పిల్లలు ఉపాధ్యాయుల ఇళ్ళల్లో భోజనం చేసేవారు. ప్రాతఃకాలానే నిద్ర లేవడం, కాలకృత్యాలు తీర్చుకొని, తమ గదులను తామే శుభ్రపరచుకొని స్నానం చేయడం, ప్రార్థన చేయటం, నియమిత వేళలలో నిద్ర పోవటం వారి దినచర్య. ఆరోగ్యం కాపాడుకోవటం, పరిశు భ్రత, సత్యాన్నే పలుకుట, కాలినడక, పెద్దలను, గురువులను గౌరవించటం వారికి నేర్పేవారు. 1919 లో కళా భవన్ ను ఆయన స్తాపించారు. ఇక్కడ విద్యారు&థలు విభిన్న కళాలను నెర్చుకునెవారు.స్వాతంత్ర్య సాధన,జనగణమణరవీంద్రుడు మొదటి నుండి జాతీయ భావాలున్నవాడు. హిందూ మేళాలో దేశభక్తి గీతాలను పాడాడు. పృథ్వీరాజు పరాజయం గురించి ప్రబోధాత్మక పద్యనాటకాన్ని రచించాడు. బ్రిటీష్ ప్రభుత్వం తిలక్‌ను నిర్భంధించినపుడు రవీంద్రుడు తీవ్రంగా విమర్శించాడు. బెంగాల్ విభజన ప్రతిఘటనోద్యమంలో రవీంద్రుడు ప్రముఖపాత్ర వహించాడు. జాతీయ నిధికి విరాళాలు వసూలు చేశాడు. రవీంద్రనాథ టాగోర్ 1896 లో జరిగిన కలకత్తా కాంగ్రెస్ సదస్సులో మొట్టమొదటిగా బంకించంద్ర చటర్జీ రచించిన వందేమాతరాన్ని ఆలపించాడు. రవీంద్రుడు వ్రాసిన ' జనగణమణ ' ను జాతీయ గీతంగా ప్రకటించేముందు "వందేమాతరం", "జనగణమన" లపై దేనిని జాతీయ గీతంగా ప్రకటించాలని సుధీర్ఘ చర్చ, తర్జన భర్జనలు జరిగాయి. అంతిమంగా రవీంద్రుడి 'జనగణమన' దే పైచేయి అయింది. దీంతో రాజ్యాంగ సభ కమిటీ అధ్యక్షుడు బాబూ రాజేంద్ర ప్రసాద్ 1950 జనవరి 24న జనగణమన ను జాతీయ గీతంగా వందేమాతరం ను జాతీయ గేయంగా ప్రకటించాడు. అదే సమయంలో రెండూ సమాన ప్రతిపత్తి కలిగి ఉంటాయని స్పష్టం చేసాడు. రెండవ ప్రపంచ యుద్ధం ప్రారంభమైనపుడు రవీంద్రుడు మానసికంగా కృంగిపోయి అనారోగ్యానికి గురి అయ్యాడు. తీవ్రంగా వ్యాధితో బాధపడుతూ, చికిత్సకై కలకత్తా నగరానికి వెళ్లాడు. కానీ ప్రయోజనం లేకపోయింది. రచయితగా, సంగీతవేత్తగా, చిత్రకారునిగా, విద్యావేత్తగా గొప్ప మానవతావేత్తగా టాగూర్ చరిత్రలో నిలిచిపోయాడు. గీతాంజలి', గోరా, ఘరే బైరే మొదలైన రచనలన్నీ సహజత్వం ఉట్టిపడేలా సామాన్యులకు సైతం సులభంగా అర్థమయ్యేలా వాడుక భాషలో, సరళమైన శబ్దాలతో ఉండేలా, దేశభక్తిని, విశ్వమానవ సౌభ్రాతత్వం చాటేలా రెండు గీతాలను భారతదేశం(జనగణమన), బంగ్లాదేశ్ (అమార సోనార్ బంగ్ల) జాతీయ గీతాలను రచించారు. ఈయన కేవలం గీత రచయిత మాత్రమే కాదు.. నాటక రచయిత, నాటక కర్త, వక్త, వ్యాఖ్యతగా బహుముఖ ప్రజ్ఞాశాలిగా ప్రసిద్ధి చెందాడు. వీటితో పాటు ప్రపంచ ప్రజలందరినీ ఉ త్తేజపరిచే సందేశాన్నిచ్చిన విశ్వకవి మాతృభూమి, మానవ సంబంధాలపట్ల అచంచలమయిన నమ్మకం, ప్రేమాభిమానాలు కలిగి ఉన్న విశ్వకవి రవీంద్రనాథ్ టాగూర్ 1941వ సంవత్సరంలో ఆగస్టు 7వ తేదీన తుదిశ్వాస విడిచారు. రవీంద్రుని రచనలలో గీతాంజలి చాలా గొప్పది. ప్రపంచ సాహిత్యంలో ఇది గొప్ప రచన. మానవుని కృంగదీసే నిరాశా నిస్పృహలను, సకల సృష్టిని ప్రేమభావంతో చూచి శ్రమ యొక్క గొప్పతనాన్ని సూచించే మహత్తర సందేశం గీతాంజలిలోని ముఖ్యాంశం. రవీంద్రుని గీతాంజలిలో విస్తృతంగా జనప్రియమైన రచన, "ఎక్కడ మనస్సు నిర్భయంగావుంటుందో, ఎక్కడమానవుడు సగర్వంగా తల ఎత్తుకుని తిరుగుతాడో,ఎక్కడవి జ్ఞానం స్వేచ్ఛగా మనగలుగుతుం దో,ఎక్కడ ప్రపంచం ముక్కముక్కలై ఇరుకైన గోడల మధ్య ప్రుగ్గిపోవ దో,ఎక్కడ మాటలు అగాధమైన సత్యం నుంచి బాహిరిల్లుతవో,ఎక్కడా విరామమైన అన్వేషణ,పరిపూర్ణత వైపు చేతులుచాస్తుందో,ఎక్కడ పరిశుద్ధ జ్ఞానవాహిని మృతాంధ విశ్వాసపుటెడారిలో ఇంకిపోదో,తలపులో పనిలో నిత్య విశాల పథాల వైపు ఎక్కడ మనస్సు పయనిస్తుందో-ఆ స్వేచ్ఛాస్వర్గంలోకి, తండ్రీ! నా దేశాన్ని మేల్కొంచేట్టు అనుగ్రహించు. ఇది యిప్పటికి ఎప్పటికి ఓ మహా అద్భుత కావ్యం చరిత్రలో నిలిచిపోతుంది.

# ఏపీలో మరో ఎన్నికకు రంగం సిద్ధ్

అమరావతి,త్వరలో లో స్థానిక సంస్థల కోటా విశాఖ ఎమ్మెల్సీ ఎన్నిక జరగనుంది. దీనికి సంబంధించి ఆగస్టు నోటిఫికేషన్ విడుదల కానుండగా,ఆగస్టు 30న ఎన్నిక జరగనుంది.ఈ ఎన్నికను ఇరు పార్టీలు కూడా ప్రతిష్టాత్మకంగా తీసుకున్నాయి. విశాఖలో స్థానికంగా వైసీపీ పూర్తి మెజార్టీతో కనిపిస్తోంది. విశాఖలో మొత్తం ఓట్లు 841 ఉండగా.. అందులో వైసీపీ బలం 615 ఉంది. టీడీపీ, జనసేన, బీజేపీ సభ్యులకు కేవలం 215 ఓట్లు మాత్రమే ఉ న్నాయి.వైసీపీ నేతలను టీడీపీలోకి తీసుకురావడానికి ఆ పార్టీ నేతలు విశ్వప్రయత్నాలు చేస్తున్నారు. ఓటర్లను తమ వైపు తిప్పుకోవాలంటే ఇంత తక్కువ సమయంలో జరిగే పని కాదు. భారీ సంఖ్యలో వైసీపీ నుంచి చేరికలు ఉంటే తప్ప , టీడీపీ కూటమి విజయం సాధించే పరిస్థితి లేదు. మరోవైపు విశాఖ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైసీపీ అభ్యర్థిగా సీనియర్ నేత బొత్స సత్యనారాయణను వైసీపీ అధినేత, మాజీ సీఎం జగన్ ఖరారు చేశారు. ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో బొత్స మాత్రమే నెగ్గుకురాగలరనే అంచనాతో ఆయన పేరును జగన్ ఖరారు చేసినట్లు తెలుస్తోంది.టీడీపీ నుంచి పీలా గోవింద్ పేరు దాదాపు ఖరారు చేసినట్టు తెలుస్తోంది.రాజకీయంగా అనుభవజ్ఞుడు, ఆర్థికంగా బలంగా ఉండటంతో అవకాశం ఇవ్వాలని టీడీపీ అధిష్టానం నిర్వహించినట్లు తెలుస్తోంది. సార్వత్రిక ఎన్నికల్లో దారుణంగా ఓడిపోయిన వైసీపీ , స్థానిక ఎన్నికల్లో మాత్రం సత్తా చాటుతోంది. విజయవాడ , కర్నూలు మున్సిపల్ కార్పొరేషన్ స్టాండింగ్ కమిటీ ఎన్నికల్లో క్లీన్ స్వీప్ చేసి అధికార పార్టీలకు గట్టి షాక్ ఇచ్చింది. ఈ ఎన్నికలో గెలిచి మరోసారి తమ సత్తా చాటాలని వైసీపీ నేతలు ప్రయత్నిస్తుండగా, వైసీపీ దూకుడుకు బ్రేక్ వేయాలని టీడీపీ నేతలు భావిస్తున్నారు. మరి విశాఖలో ఎవరు పైచేయి సాధిస్తారో చూడాలి.

# కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల దృష్టికి ముస్లింల సమస్యలు

కర్నూలు ,ముస్లింల సమస్యలను కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల దృష్టికి తీసుకుని పోయి పరిష్కారం చేస్తానని ముస్లిం రాష్ట్రీయ మంచ్ తెలుగు రాష్ట్రాల అధ్యక్షుడు హాఫీజ్ కరీముల్లా షేక్ కర్నూలు లో అన్నారు. కర్నూలు లోని ఆయన కార్యాలయంలో మీడియా సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీ లో తాను ముస్లిం మైనారిటీ మోర్చా లో పనిచేసినందుకు బీజేపీ పెద్దలు తనకు దిల్లీలో ముస్లిం రాష్ట్రీయ మంచ్ ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలకు అధ్యక్షుడు గా నియమించారని తెలిపారు. ముస్లిం రాష్ట్రీయ మంచ్ ముఖ్య ఉద్దేశ్యం భారతీయులందరి మధ్య సోదర భావం కల్పించడమే అన్నారు. ఆర్.ఎస్.ఎస్.లో ముస్లిం రాష్ట్రీయ మంచ్ భాగమే అన్నారు. కేంద్ర ప్రభుత్వ సహకాంతో ముస్లిం ల అభివృద్ధి కి కృషి చేస్తానని హాఫీజ్ కరీముల్లా షేక్ తెలిపారు. ముస్లింలు హిందువులు వేరు కాదని అందరూ భారతదేశ పౌరులే అన్నారు. హిందూ, ముస్లింలకు మధ్యన ఉన్న అపోహలను ముస్లిం రాష్ట్రీయ మంచ్ తొలగిస్తుందన్నారు.

# ఆయకట్టు రైతుల న్యాయం చేయండి

మిడుతూరు మిడుతూరు మండలం, జలకనూరు గ్రామ మద్దిగుండం చెరువులోని సాగునీటిని విద్యుత్ మోటార్ల ద్వారా అక్రమంగా వాడుకోవడాన్ని అరికట్టాలని కోరుతూ జలకనూరు గ్రామ రైతులు డిఆర్ఓని కలిసి వినతి పత్రం సమర్పించారు. అనంతరం మైనర్ ఇరిగేషన్ అధికారులను కలిసి సమస్యను విన్నవించుకున్నారు.అనేక సంవత్సరాల నుండి జలకనూరు గ్రామంలో వర్షధారమైనటువంటి మద్దిగుండం చెరువు ద్వారా పంటలు సాగు చేసుకుని జీవిస్తున్నామని, ఈ సంవత్సరం జూన్ లో కురిసినటువంటి వర్షాల వల్ల చెరువు కు నీళ్లు రావడంతో వాటిపై ఆధారపడి మొక్కజొన్న, మిరప పంటలు సాగు చేసుకున్నామని, ప్రస్తుతం పంట చేతికి వచ్చే దశలో పంటలు ఉన్నాయని,ఈ దశలో ఉన్నటువంటి కొద్దిపాటి నీరును మా పక్క గ్రామాల్లోని రైతంగం 120 విద్యుత్ మోటార్లను పెట్టి ఉన్న నీటిని సుదూర ప్రాంతాలకు అక్రమంగా తోడి వేయడం వల్ల ఆయకట్టు దారులైన రైతులందరూ తీవ్రంగా నష్టపోతున్నారు.ఈ విషయమై గతంలో స్పందన కార్యక్రమంలో కలెక్టర్ మరియు ఇరిగేషన్ అధికారులు దృష్టికి సమస్య తీసుకురావడంతో పక్క గ్రామం రైతాంగాన్ని మోటార్లను తీసివేయమని చెప్పినా కూడా ఏ మాత్రం పట్టించుకోవడం వల్ల ప్రస్తుతం ఆయకట్టు రైతులందరూ కూడా పంటను కోల్పోయి తీవ్రంగా నష్టపోతున్నారు. తక్షణమే జిల్లా మైనర్ ఇరిగేషన్ అధికారులు మరియు రెవిన్యూ అధికారులు జోక్యంతో మద్దిగుండం చెరువు ఆయకట్టు రైతులకు పంట వచ్చేంతవరకు సాగునీరు విడుదల చేయాలని పక్క గ్రామం రైతాంగం నుండి సాగునీటి దోపిడీ నుండి ఆపి జలకనూరు గ్రామ రైతులకు రక్షణ కల్పించాలని వారి పంట వచ్చేందుకు అవసరమైన నీటిని ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ వినతిపత్రం సమర్పించారు.

# పాదయాత్రకు సిద్ధమౌతున్న షర్మిళ



విజయవాడ, ఆగస్టు 6 వైఎస్ షర్మిల పాదయాత్ర చేస్తారా? రాష్ట్రవ్యాప్తంగా పాదయాత్ర చేసేందుకు సిద్ధపడ్డారా? ఇందుకు సంబంధించి సన్నాహాలు చేస్తున్నారా? మూడు విడతల్లో చేపట్టనున్నారా? అంటే అవుననే సమాధానం వినిపిస్తోంది. పిసిసి అధ్యక్షురాలిగా బాధ్యతలు స్వీకరించిన ఆమె దూకుడుగా కొనసాగుతున్నారు. మొన్నటి ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపు కంటే.. వైసిపి ఓటమికి ఎక్కువగా పని చేశారు. తాను అనుకున్నది సాధించారు. జగన్ ను గద్దె దించాలని లక్ష్యంతో పనిచేసిన ఆమె సక్సెస్ అయ్యారు. వైసీపీ ఓటమితోనే పార్టీ క్యాడర్ తో పాటు నాయకులు కాంగ్రెస్ పార్టీ వైపు వస్తారని భావిస్తున్నారు. అందుకే ఇప్పుడు పాదయాత్ర చేస్తే రాష్ట్రవ్యాప్తంగా ఒక రకమైన చేంజ్ కనిపిస్తుందని అంచనా వేస్తున్నారు. వైసీపీకి ఘోర పరాజయంతో జగన్ రాష్ట్రంలో ఉండేందుకు కూడా ఇష్టపడడం లేదు. వైసీపీ సీనియర్లు సైలెంట్ అయ్యారు. జూనియర్లు సైతం జగన్ కు దూరంగా జరుగుతున్నారు. ఇటువంటి తరుణంలో పాదయాత్ర చేస్తే ప్రజల్లో స్థానాన్ని సంపాదించుకోవడంతోపాటు వైసిపి క్యాడర్ను కాంగ్రెస్ వైపు మళ్లించవచ్చని భావిస్తున్నారు షర్మిల. మొన్నటి ఎన్నికల్లో కాంగ్రెస్ వ్యూహం పనిచేసింది. వైసిపి ఓడిపోయింది. కనీసం ప్రతిపక్ష హోదా కూడా దక్కలేదు. కాంగ్రెస్ పార్టీకి కావాల్సింది కూడా ఇదే. అందుకే వైసిపి నేతలను ఆకర్షించే పనిలో పడింది కాంగ్రెస్. అందుకే షర్మిల పాదయాత్రకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు తెలుస్తోంది. రాష్ట్రంలో మూడు ప్రాంతాల్లో.. మూడు విడతల్లో పాదయాత్ర చేసేందుకు షర్మిల సిద్ధపడినట్లు తెలుస్తోంది. ఎన్నికల ఫలితాలు వచ్చి రెండు నెలలు దాటకముందే ఆమె ఇలాంటి నిర్ణయం తీసుకోవడం విశేషం.తెలుగు నాట పాదయాత్ర చేసిన ఏ నేత ఫెయిల్ కాలేదు. 2003లో సుదీర్ఘ పాదయాత్ర చేసి అధికారంలోకి రాగలిగారు వైయస్ రాజశేఖర్ రెడ్డి. తాను సీఎం కావడమే కాదు కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తెచ్చారు. కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటుకు అవసరమైన ఎంపీలను గెలిపించి ఇచ్చారు. అటు తరువాత చంద్రబాబు పాదయాత్ర చేశారు అధికారంలోకి వచ్చారు. జగన్ పాదయాత్ర చేసి మంచి విజయాన్ని దక్కించుకున్నారు. అయితే 2013లో షర్మిల పాదయాత్ర చేశారు. అన్న జగన్ జైలులో ఉండడంతో ఆయన తరుపున ఉమ్మడి రాష్ట్రంలో నడిచారు. కానీ వైసీపీని అధికారంలోకి తేలేకపోయారు.వైసీపీ నాయకులు పార్టీ నాయకత్వం పై అసంతృప్తితో ఉన్నారు. జగన్ వైఖరి నచ్చని చాలామంది సీనియర్లు రాజకీయంగా సైలెంట్ అయ్యారు. మరికొందరు కూటమి పార్టీల్లో చేరాలనుకున్నా ఆహ్వానం లేదు. మరోవైపు జాతీయ స్థాయిలో కాంగ్రెస్ పార్టీ పుంజుకుంటుంది. వచ్చే ఎన్నికల నాటికి మంచి స్థితిలోకి వస్తుందని విశ్లేషణలు ఉన్నాయి.

## తల్లిపాలే బిడ్డకు సంజీవని లాంటిది.

సూపర్వైజర్ లక్ష్మీదేవి. ర్యాలీ నిర్వహిస్తున్న సూపర్వైజర్ అంగన్వాడి సిబ్బంది.



నంద్యాల/రుద్రవరం–శ్రీ ప్రస్థానం:–తల్లిపాలే బిడ్డకు సంజీవని లాంటిదని అంగన్వాడి సూపర్వైజర్ లక్ష్మీదేవి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలలో భాగంగా అంగన్వాడి సూపర్వైజర్ లక్ష్మీదేవి అధ్యక్షతన అంగన్వాడి సిబ్బంది పలు వీధుల వెంబడి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్వాడి సిబ్బంది మాట్లాడుతూ తల్లిపాలు బిడ్డకు పట్టడం వలన రోగ నిరోధక శక్తి పెరిగి బిడ్డలు ఎటువంటి రోగాల బారిన పడకుండా ఎంతో ఆరోగ్యంగా ఉంటారని వారు తెలిపారు. అలాగే బిడ్డల పట్ల తల్లులు ఎప్పటికప్పుడు వైద్యాధికారుల సూచనలను పాటిస్తూ చాలా జాగ్రత్తలు వహిస్తూ ఉండాలన్నారు. బిడ్డల తల్లులు ఇంటి పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకొని ఆరోగ్యంగా ఉండాలని వారు సూచించారు. ఎప్పటికప్పుడు వారి చేతులను పరిశుభ్రంగా చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి నాయకురాళ్లు మనోజ, పద్మావతి, సువర్ణ, రాణెక్క, అంగన్వాడి కార్యకర్తలు మాబుచ్చాన్, సరిత, రాఘవేంద్రమ్మ, తదితర అంగన్వాడి కార్యకర్తలు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఆళ్లగడ్డ టౌన్ సీఐ గా చిరంజీవి



ఆళ్లగడ్డ, ఆగస్టు:06, శ్రీ ప్రస్థానం న్యూస్:– ఆళ్లగడ్డ టౌన్ సీఐ గా ఎస్. చిరంజీవి మంగళవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ గతంలో పోరుమామిళ్ల సర్కిల్ సీ.ఐగా పనిచేయడం జరిగిందని కర్నూలు రేంజ్ డీఐజీ కోయ ప్రవీణ్ ఆదేశాల మేరకు ఆళ్లగడ్డ సీఐ గా పదవి బాధ్యతలు చేపట్టడం జరిగిందన్నారు. విధుల పట్ల నిష్పక్షపాతం వివరిస్తామని అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కుపాదం మోపుతామన్నారు. ఆళ్లగడ్డ టౌన్ పరిధిలో ఏమైనా సమాచారం ఉంటే తమకు అందించాలని సీఐ చిరంజీవి పేర్కొన్నారు..

## క్రిష్టి పాడు లో ఘనంగా జార్తలు .

దొర్నిపాడు, ఆగస్టు:06, శ్రీ ప్రస్థానం న్యూస్ :– మండలంలోని క్రిష్టి పాడు గ్రామంలో హజరత్ ఇమామ్ కాశిం స్వామి వార్ల జార్తలు మంగళ వారం ఘనంగా జరిగాయి.. మొహరం పండుగ అనంతరం 21 వ రోజున నిర్వహించిన హజరత్ ఇమామ్ కాశిం స్వామి వార్ల జార్తల ఉత్సవాలను పటిష్ఠమైన పోలీసు బందోబస్తు మధ్య ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరిగకుండా కులమతాలకు అతీతంగా ఘనంగా నిర్వహించారు.. జార్తలు సందర్బంగా నిర్వహించే గ్రామీణ ప్రాచీన క్రీడలైన కోలాటం వంటి సాంస్కృతిక కార్యక్రమాలను చూసేందుకు చుట్టూ ప్రక్కల గ్రామాల ప్రజలు వేలాది గా తరలి వచ్చారు..బుధవారము తెల్ల వారు జమున నుంచి హజరత్ ఇమామ్ కాశిం, స్వామి వార్ల ను లను గ్రామంలోని పురవీధుల్లో మేల తాళాల మధ్య ప్రతి ఇంటింటికీ తిరిగి భక్తులకు దర్శనం ఇచ్చిన పిదప ముజావారి చేత పతేహాలు నిర్వహించి పప్పులు చెక్కర స్వామి వారికి సమర్పించి మొక్కులు చెల్లించు కుంటారు.. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, కమిటీ సభ్యులు కట్టుబడి ఆబ్దుల్ రహిం బాషా,కట్టుబడి బాషా, ఎం. రఫి, పెట్నికోట ఉస్సెన్ బాషా మద్దుబై గారి రఫీ, ఎం ముస్కింసా, ఎస్. ఉస్సేన్ బాషా, కె. చాంద్ బాషా, సొదరదిన్నే ఉస్సెన్సా (బెబ్బే), పోలీస్ సిబ్బంది,మరియు ప్రజలు పాల్గొన్నారు..



## పార్టీలకతీతంగా అధికారులు పనిచేయాలి... ఎమ్మెల్యే భూమా.



గ్రామాలను అభివృద్ధి చేయడమే ప్రభుత్వ లక్ష్యం.
గ్రామాల్లో ప్రతి ఇంటికి త్రాగునీటి కొళాయిలు ఏర్పాటు చేస్తాం.
ప్రతి మండలానికి రూ 2 కోట్ల నిధులు కేటాయింపు.
ప్రతి మండలంలో మినీ గోకులాలు ఏర్పాటు.
మండల సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ.



నంద్యాల/రుద్రవరం–శ్రీ ప్రస్థానం:–ఆళ్లగడ్డ నియోజకవర్గంలో గ్రామాల అభివృద్ధి కోసం పార్టీలకతీతంగా పనిచేస్తామని ప్రజా సంక్షేమమే తమ లక్ష్యంగా మన రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు ప్రజలకు అన్నివేళలా అందుబాటులో ఉండి ప్రజా సమస్యలపై దృష్టి సారిస్తామని ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిల ప్రియ అన్నారు. మండల కేంద్రంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఎంపీపీ మబ్బు బాలస్వామి, ఎంపీడీవో రామచంద్ర ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన మండల సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యే భూమా అఖిల ప్రియ పాల్గొన్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ రుద్రవరం మండలం ప్రభుత్వ అధికారులకు, నాయకులకు ముఖ్యంగా తెలియజేయడమేమనగా గ్రామాల సమస్యలు వెంటనే పరిష్కారమయ్యేలా పార్టీలకతీతంగా పనిచేయాలన్నారు. మండలంలోని ప్రతి గ్రామంలో ఎన్నికల సమయంలో తిరిగినప్పుడు నాకు చాలా సమస్య లు చెప్పారన్నారు, కనుక ఖచ్చితంగా వారి సమస్యలను తూచా తప్పకుండా తీరుస్తాను అని హామీఇచ్చారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆళ్లగడ్డ అభివృద్ధి కోసం ప్రతి మండలానికి రూ2 కోట్ల రూపాయలు నిధులను మంజూరు చేయడం జరిగిందన్నారు. ఈ నిధులు సరిపోకపోయినా ఇంకో రూ1 కోటి రూపాయలు ప్రతి మండలానికి తీసుకోని వస్తాను అని ఆళ్లగడ్డ అభివృద్ధి కోసం ఖచ్చితంగా చంద్రబాబు నాయుడు ఎంతైనా పెట్టడానికి రెడీగా ఉన్నారన్నారు. మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజనం విషయంలో నాణ్యతలేని భోజనం పిల్లలకు పెడితే సహించేది లేదన్నారు. అది సొంత పార్టీ టీడీపీ వాళ్ళు అయినా ఎవరైనా వెంటనే విధుల నుండి తొలగించి వేరే వాళ్లకు ఇవ్వండి నాకు కూడా చెప్పాల్సిన అవసరం లేదు అని అధికారులకు ఆదేశాలు జారీచేశారు. సీఎం చంద్రబాబు నాయుడు ముఖ్య ఉద్దేశం ప్రతి ఒక్క ఇంటికి నీటి కుళాయి ఉండాలి నీటి కోసం ఎవరు ఇబ్బంది పడకూడదని ఖచ్చితంగా ప్రతి ఒక్క కుటుంబానికి కుళాయిలు ఇవ్వాలని భూమా అఖిలప్రియ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. గత ప్రభుత్వం లో ఇళ్ళు కట్టుకోవాలి అంటే చాలా ఇబ్బంది పడ్డారు రూ1.80 వేల రూపాయలు ఎలా సరిపోతుంది అలాగే సెంటున్నర స్థలంలో ఎలా కట్టుకుంటారు ఇళ్ళు.. అని ప్రజలు అడిగిన ప్రశ్నలకు సమాధానం గా చంద్రబాబు నాయుడు వచ్చిన తర్వాత అసెంబ్లీ లో మాట ఇచ్చారు ఇల్లు కట్టుకోవడానికి రూ 4 లక్షల రూపాయలు ఇవ్వాలి అని అధికారులకు చెప్పరు అలాగే పల్లెటూరు లో 3 సెంట్లు స్థలం పట్టణం లో 2 సెంట్లు కూడా ఇవ్వాలని ఆలోచనలో ఉన్నారు అన్నారు. త్వరలో ఇది కూడా నెరవేరుతుందని ఆశా భావంవ్యక్తం చేశారు వచ్చే బడ్జెట్ సమావేశాలు అయిపోయిన తర్వాత ఇళ్ళు లేని ప్రతి ఒక్కరు ఇంటి నిర్మాణం కోసం దరఖాస్తు చేసుకోవాలని ప్రజలను కోరారు. రుద్రవరం మండలంలో ఎక్కడ ఎక్కడ రోడ్లు కావాలో, డ్రైనేజీ కాలువలు కావాలో మీరందరూ ఆలోచించుకొని నా దృష్టికి తీసుకొని వస్తే ఖచ్చితంగా రోడ్లు మరియు డ్రైనేజీ కాలువలు అన్నింటిని పూర్తి చేపిస్తామని హామ ఇచ్చారు. ఆళ్లగడ్డ ఏరియాలో ప్రతి మండలం లో 25 మినీ గోకులలు మాత్రమే ప్రభుత్వం శాంక్షన్ చేయడం జరిగింది అన్నారు 25 మినీ గోకులాలు సరిపోవని పశు వైద్య అధికారులు తెలుపగా సంబంధిత మంత్రులతో మాట్లాడి ప్రతి మండలానికి ఎక్కువ విని గోకులాలు వచ్చేలాగా చూస్తానని భూమా అఖిలప్రియ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహశిల్దార్ రవీంద్ర ప్రసాద్ తో పాటు అన్ని శాఖలకు సంబంధించిన అధికారులు, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు యర్రం ప్రతాపరెడ్డి, జంగా పెద్ద పుల్లారెడ్డి, ఎల్వి రంగనాయకులు, పోలా గురుమూర్తి, లక్ష్మీకాంత్ యాదవ్, చిన్ని కృష్ణ యాదవ్, శేఖర్ యాదవ్, శ్రీను యాదవ్, బిసి,ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి రాజారావు, నారాయణరెడ్డి, గంతి శ్రీను, సోషల్ మీడియా మెంబర్ మొల్కా గుర్రప్ప, దూదేకుల మౌలాలి, తెలుగుదేశం పార్టీ తదితర నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఏపీ టెట్ కు దరఖాస్తుల వెల్లువ

విజయవాడ, ఆగస్టు 6ఏపీలో ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) దరఖాస్తు గడువు ఆగస్టు 3తో ముగిసింది. రాష్ట్రవ్యాప్తంగా టెట్ పరీక్ష కోసం మొత్తం 4,27,300 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. ఈ మేరకు పాఠశాల విద్యాశాఖ వివరాలు వెల్లడించింది. గతంలో నిర్ణయించిన షెడ్యూల్ ప్రకారం అక్టోబర్ 3 నుంచి 20 వరకు టెట్ పరీక్షలు పరీక్షలు నిర్వహించనున్నారు. ఆయా తేదీల్లో ప్రతిరోజూ రెండు సెషన్లలో టెట్ పరీక్షలు నిర్వహిస్తారు. ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు మొదటి సెషన్‌లో, మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు రెండో సెషన్‌లో పరీక్షలు నిర్వహిస్తారు. పరీక్ష హాల్‌టికెట్లను సెప్టెంబరు 22 నుంచి అందుబాటులో ఉంచనున్నారు.

అందిన దరఖాస్తులు ఇలా..

ఎస్‌జీటీ విభాగంలో పేపర్ 1-ఎకు 1,82,609 మంది; ఎస్‌జీటీ (స్పెషల్ ఎడ్యుకేషన్) పేపర్ 1- బికు 2,662 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు.

స్కూల్ అసిస్టెంట్ టీచర్ విభాగంలో పేపర్ 2-ఎ లాంగ్వేజెస్‌కు 64,036 మంది; మ్యాథ్స్, సైన్స్‌కు కలిపి మొత్తం 1,04,788 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు.

సోషల్ స్టడీస్‌కు సంబంధించి 70,767 మంది, స్కూల్ అసిస్టెంట్ టీచర్(స్పెషల్ ఎడ్యుకేషన్) పేపర్ 2- బి విభాగంలో 2,438 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు.

పరీక్ష విధానం..

ఒక్కో పేపరుకు 150 మార్కులకు పరీక్ష నిర్వహిస్తారు. పరీక్షలో మొత్తం 150 ప్రశ్నలు అడుగుతారు. ఒక్కో ప్రశ్నకు ఒకమార్కు కేటాయించారు. పరీక్షలో నెగెటివ్ మార్కులు లేవు. పరీక్ష సమయం 2.30 గంటలు.

పేపర్-1 ఎలో 150 ప్రశ్నలకుగాను 150 మార్కులకు: చైల్డ్ డెవలప్‌మెంట్ అండ్ పెడగోగి 30 ప్రశ్నలు-30 మార్కులు, లాంగ్వేజ్-1 30 ప్రశ్నలు-30 మార్కులు, లాంగ్వేజ్-2 (ఇంగ్లిష్) 30 ప్రశ్నలు-30 మార్కులు, మ్యాథమెటిక్స్-30 ప్రశ్నలు-30 మార్కులు, ఎన్విరాన్‌మెంటల్ సైన్స్-30 ప్రశ్నలు-30 మార్కులు ఉంటాయి.

పేపర్-1 బిలో 150 ప్రశ్నలకుగాను 150 మార్కులకు: చైల్డ్ డెవలప్‌మెంట్ అండ్ పెడగోగి 30 ప్రశ్నలు-30 మార్కులు, లాంగ్వేజ్-1 30 ప్రశ్నలు-30 మార్కులు, లాంగ్వేజ్-2 (ఇంగ్లిష్) 30 ప్రశ్నలు-30 మార్కులు, మ్యాథమెటిక్స్-30 ప్రశ్నలు-30 మార్కులు, ఎన్విరాన్‌మెంటల్ సైన్స్-30 ప్రశ్నలు-30 పేపర్-2 ఎలో 150 ప్రశ్నలకుగాను 150 మార్కులకు: చైల్డ్ డెవలప్‌మెంట్ అండ్ పెడగోగి 30 ప్రశ్నలు-30 మార్కులు, లాంగ్వేజ్-1 30 ప్రశ్నలు-30 మార్కులు, లాంగ్వేజ్-2 (ఇంగ్లిష్) 30 ప్రశ్నలు-30 మార్కులు, మ్యాథమెటిక్స్/బయాలజీ/ఫిజిక్స్/సోషల్ స్టడీస్/లాంగ్వేజ్-60 ప్రశ్నలు-60 మార్కులు ఉంటాయి.

పేపర్-2 బిలో 150 ప్రశ్నలకుగాను 150 మార్కులకు: చైల్డ్ డెవలప్‌మెంట్ అండ్ పెడగోగి 30 ప్రశ్నలు-30 మార్కులు, లాంగ్వేజ్-1 30 ప్రశ్నలు-30 మార్కులు, లాంగ్వేజ్-2 (ఇంగ్లిష్) 30 ప్రశ్నలు-30 మార్కులు, కేటగిరీ ఆఫ్ డిజెబిలిటీ స్పెషలైజేషన్ అండ్ పెడగోగి -60 ప్రశ్నలు-60 మార్కులు ఉంటాయి.

పరీక్షలో అర్హత మార్కులను ఓసీలకు 60 మార్కులు, బీసీలకు 50 మార్కులు, ఎస్సీ-ఎస్టీ-దివ్యాంగులు-ఎక్స్‌సర్వీస్‌మెన్ అభ్యర్థులకు 40 శాతం ఉంటే సరిపోతుంది.

ముఖ్యమైన తేదీలు...

ఏపీటెట్ జులై -2024 నోటిఫికేషన్ వెల్లడి: 02.07.2024.
దరఖాస్తు ఫీజు చెల్లింపు తేదీలు: 03.07.2024 -03.08.2024.
ఆన్‌లైన్ దరఖాస్తు ప్రక్రియ ప్రారంభం: 03.07.2024 -03.08.2024.
ఆన్‌లైన్ మాక్ టెస్టులు అందుబాటులో: 19.09.2024 నుంచి.
టెట్ హాల్‌టికెట్ల డౌన్‌లోడ్: 22.09.2024 నుంచి
టెట్ పరీక్ష షెడ్యూలు: 03.10.2024 - 20.10.2024. టపేపర్-1(ఎ) ఑ పేపర్-1(బి), పేపర్-2(ఎ) ఑ పేపర్-2(బి)ఊ
పరీక్ష సమయం..
సెషన్-1: ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు.
సెషన్-2: మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5.00 గంటల వరకు
టెట్ ప్రాథమిక 'కీ' విడుదల: 04.10.2024.
ఆన్సర్ కీపై అభ్యంతరాల స్వీకరణ: 05.10.2024 నుంచి.
టెట్ ఫైనల్ కీ: 27.10.2024.
టెట్ ఫలితాల వెల్లడి: 02.11.2024.

## వారణాసిలో కుప్పకూలిన రెండు ఇళ్లు

ఓ మహిళ మృతి..శిథిలాల కింద మరో ఏడుగురు

వారణాసి,ఆగస్ట్6: ఉత్తరప్రదేశ్‌లోని వారణాసిలో ఉన్న కాశీ విశ్వనాథ ఆలయం సమీపంలో మంగళవారం ఉదయం రెండు ఇళ్లు కూలిపోయాయి. ఈ ఘటనలో ఓ మహిళ మృతి చెందగా.. మరో ఎనిమిది మంది తీవ్రంగా గాయపడ్డారు. సమాచారం అందుకున్న పోలీసులు, నేషనల్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ (ఎన్‌డీఆర్‌ఎఫ్), వైద్యులు, డాగ్ స్క్వాడ్‌తో కూడిన బందం వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. శిథిలాల కింద చిక్కుకున్న 8 మందిని బయటకు తీశారు. తెల్లవారుజామున 3గంటలకు ఒక ఇల్లు కూలిపోగా..ఆ వెంటనే దాని పక్కనున్న మరో ఇల్లు కుప్పకూలినట్టు స్థానికులు తెలిపారు. ప్రమాదం తర్వాత మైదాగిన్, గొదౌలియా నుంచి కాశీ విశ్వనాథ ఆలయానికి వెళ్లే రహదారిని మూసివేశారు. నగరంలో భారీ వర్షం కారణంగానే ఇళ్లు కూలిపోయాయని పోలీసులు వెల్లడించారు. ఈ ఘటనపై సీఎం యోగీ ఆధిత్య నాథ్ స్పందించారు. క్షతగాత్రులకు మెరుగైన చికిత్స అందించాలని ఆదేశాలు జారీ చేశారు. సోమవారం అర్ధరాత్రి 2 గంటల సమయంలో నేలమట్టం అయ్యాయి. ఇళ్లు కూలిపోయామని సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే అక్కడికి చేరుకున్నారు. సహాయక చర్యల్లో ఆరోగ్యశాఖ, డాగ్ స్క్వాడ్, ఎన్డీఆర్‌ఎఫ్ బృందాలు పాల్గొన్నాయి. చౌక్ పోలీస్ స్టేషన్ ఏరియాలో గల ఖోవా గలిలో ఉన్న రెండు గృహాలు ఒక్కసారిగా కూలిపోయాయి. అర్ధరాత్రి సమయం కావడంతో ఇళ్లలో ఉన్నవారు గాఢ నిద్రలో ఉన్నారు. శిథిలాల కింద ఎనిమిది మంది చిక్కుకున్నారని ప్రాథమికంగా అధికారులు వివరించారు. వారిలో ఓ పోలీసు కానిస్టేబుల్ కూడా ఉన్నారు. ముగ్గురిని శిథిలాల నుంచి బయటకు తీశారు. వారిని చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. మరో ఐదుగురు శిథిలాల కింద ఉన్నారు. వారిని వెలికితీసే ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఇంకా ఎవరైనా చిక్కుకొని ఉన్నారా అని పరిశీలిస్తున్నారు. ఇళ్లు కూలిపోవడానికి గల కారణాలు తెలియరాలేదు.

## నూతన తహశీల్దార్ ను కలిసిన మండల డీలర్లు.



దొర్నిపాడు,ఆగస్టు:06, శ్రీ ప్రస్థానం న్యూస్ :– దొ ర్నిపాడు మండల నూతన తహశీల్దార్ గా బాధ్యతలు చేపట్టిన సుభద్ర,ను స్థానిక తహశీల్దార్ కార్యాలయం లో మంగలవారం మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన రేషన్ డీలర్లు కలసి పుష్ప గుచ్చం అందజేసి శుభాకంక్షలు తెలియజేశారు.. ఈ సంధర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల్లోని ప్రజలకు అందుబాటులో ఉంటూ రేషన్ దుకాణాల్లో అందించే నిత్యవసర సరుకులను సకాలంలో సరైన సమయంలో అందించేలా చర్యలు తీసుకోవాలని డీలర్లకు సూచించారు.. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ వీ ఆర్ ఓ. వెంకటేశ్వర రెడ్డి,కాకర్ల మోహన్ నాయుడు, మదు, హబీబ్ బాషా,జగదీశ్వర రెడ్డి,రమణయ్య, రామకృష్ణ , భూపాల్, వీరా రెడ్డి,లు పాల్గొన్నారు..

## పెద్దమ్మకు ప్రత్యేక పూజలు.



దొర్ని పాడు,ఆగస్టు:06, శ్రీ ప్రస్థానం న్యూస్:– మండలం లోనీ డబ్ల్యు. గోవిందిన్నే గ్రామంలో వెలసిన శ్రీ మూల పెద్దమ్మ,కు ప్రతి ఆదివారం మంగళ వారం, రోజున చుట్టూ ప్రక్కల గ్రామాల ప్రజల తో పాటు సదురా ప్రాంతాల నుండి కుల మతాలకు అతీతంగా అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. వేకువ జామునే మహిళలు పుణ్య స్నానాలు ఆచరించి అమ్మవారిని దర్శించుకుని గాజులు,నిమ్మకాయలు, పట్టు వస్త్రాల తో అలంకరించి కొబ్బరి కాయలు కొట్టి కుంకుమార్చనలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించారు. కోరిన కోర్కెలు తీరిన భక్తులు మొక్కులు చెల్లించు కుంటారు.అమ్మ వారికి బోనాలు సమర్పించి ఒడి బియ్యం పోసి మేక పోతు లు, కోడి పుంజులను బలి ఇస్తారు.. ఆలయ కమిటీ సభ్యులు తలారి శ్రీను, శంకరయ్య, చిన్న పెద్దన్న, చిన్నన్న, లు భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు.. భక్తుల సౌకర్యార్థం టిక్కెట్,ప్రసాదం, కొరకు ప్రత్యేక కౌంటింగ్ ను ఏర్పాటు చేశారు..

## తిరుమలలో తెలంగాణ సిఫార్సు లేఖలు చెల్లవు : టిటిడి ఈఓ

తిరుపతి ఆంధ్రప్రదేశ్ లో ప్రముఖ పుణ్యక్షేత్రం తిరుమల తిరుపతి దేవస్థానం కీలక విషయంపై స్పష్టత నిచ్చింది.? ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే భక్తులు తీసుకువచ్చే సిఫారసు లేఖలను అనుమతించబోమని టీటీడీ ఈఓ శ్యామల రావు తేల్చి చెప్పారు.? టీటీడీ నిర్వహించిన డయల్ యువర్ ఈవో కార్యక్రమంలో ఈవో శ్యామల రావు భక్తులు అడిగిన పలు ప్రశ్నలకు సమాధానం ఇచ్చారు. ? తిరుమల దర్శనానికి సంబంధించి తెలంగాణ ప్రజాప్రతినిధుల సిఫారసు లేఖలు ఎందుకు తీసుకోవడం లేదని ప్రశ్నించాడు.? దీనిపై స్పందించిన టీటీడీ ఈఓ శ్యామల రావు శ్రీవారి దర్శనానికి ఆంధ్రప్రదేశ్ కు సంబంధించిన ప్రజాప్రతినిధుల నుండి వచ్చిన సిఫారసు లేఖలు మాత్రమే అనుమతిస్తున్నామని స్పష్టం చేశారు.? ఇతర రాష్ట్రాల నుంచి సిఫార్సు లేఖలు తీసుకువస్తే అవి చెల్లుబాటు కావని తేల్చేశారు.

## కంటి సమస్యలపై నిర్లక్ష్యం వహిస్తే శాశ్వత అంధకారానికి లోనవుతారు

.బాల సాయి సెంట్రల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మారమునగాల గ్రామంలో ఉన్న బాల సాయి కంటి వైద్యశాల ఆవరణలో బాల సాయి ట్రస్ట్ మేనేజర్ రామారావు సహకారంతో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ ఉచిత వైద్య శిబిరంలో ప్రముఖ కంటి వైద్య నిపుణులు డాక్టర్ జయప్రకాష్ పాల్గొని మాట్లాడుతూ మన శరీరంలో అతి ముఖ్యమైన భాగమైన కంటిని సమస్యల నుండి జాగ్రత్తగా కాపాడుకోవాలని, కంటి సమస్యలను గుర్తించిన వెంటనే వైద్యుని సంప్రదించి చికిత్స అందేలా చూసుకోవాలన్నారు. చెవి ,ముక్కు ,గొంతు వైద్య నిపుణులు డాక్టర్ బాల ఈశ్వర్ మాట్లాడుతూ ఈ కాలుష్య వాతావరణం లో తరచూ ఆరోగ్య పరీక్షలు చేయించుకుంటూ ఉండాలన్నారు. లయన్స్ క్లబ్ ఆఫ్ కర్నూల్ మెల్విన్ జోన్స్ ప్రతినిధి లయన్ డాక్టర్ రాయపాటి శ్రీనివాస్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలలో వైద్య సేవలు అందించడానికి లయన్స్ క్లబ్ ముందుంటుందన్నారు. ప్రారంభ కార్యక్రమం అనంతరం లయన్స్ క్లబ్ ఆఫ్ కర్నూల్ మెల్విన్ జోన్స్ ఆధ్వర్యంలో డాక్టర్లను సన్మానించారు. వైద్య పరీక్షలు అనంతరం ఉచితంగా కంటి అద్దాలు మరియు కంటికి సంబంధించిన మందులను 100 మందికి పైగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆర్ఎంపీ డాక్టర్ శ్రీ మద్దయ్య, శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



EDITED,PRINTED,PUBLISHED AND OWNED BY PERUMALLA CHENNAKESHAVULU PRINTED AT UTTEJITHA PRINTERS, H.NO: 46/801, BUDHAWARAPETA, KURNOOL DIST. - 518001, ANDHRA PRADESH, INDIA. PUBLISHED AT H.NO: 43/217A, N R PETA, KURNOOL DIST., ANDHRA PRADESH, INDIA. EDITOR : PERUMALLA CHENNAKESHAVULU.RNI No : APTEL 2020/80757